ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 17 నవంబరు 2024 | 5


ఆదివారం ప్రత్యేకం

మనకూ ఒకరోజు కావాలి.. మన నచ్చినట్టు ఉండాలి.. పదిమందితో కలిసి ఆనందంగా గడపాలి.. గంతులు వేయాలి.. ఆటలు ఆడాలి.. పాటలు పాడాలి.. డ్యాన్స్ చేయాలి.. ఆ రోజంతా ఖాళీగా గడపాలి.. ఇలా ఏడాదికి ఓ రోజు.. చాలు ఏడాదంతా జ్ఞాపకం చేసుకుంటూ బతికేస్తాం.. ఇదీ ప్రస్తుత తరం ఆలోచన. ఎందుకంటే బిజీ జీవితం.. తీవ్ర ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు.. ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకూ పరుగులే.. ఎక్కడా ఖాళీ ఉండదు.. సాయంత్రానికి ఖాళీగా కూర్చుని ఆలోచిస్తే ఇంతేనా జీవితం అనిపిస్తుంది.. ఎందుకంటే ప్రస్తుతం ఉమ్మడిగా చేసుకునే పండుగల్లేవ్.. సరదాగా కలుసుకునే సందర్భాల్లేవ్.. వచ్చామా.. వెళ్లామా అంతే.. అందుకే కార్తీక మాసం సందర్భంగా ఏడాదికో మారు పిక్నిక్ పెట్టుకుంటున్నారు.. కుటుంబీకులు, స్నేహితులు కలిసి రీఫ్రెష్ అవుతున్నారు.. మనిషన్నాక కాసింత కళాపోషణ ఉండాల అని ముత్యాల ముగ్గు సినిమాలో రావుగోపాలరావు అన్నట్టు.. ఆ రోజంతా తమ కళాపోషణ బయటపెడుతున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపి బై బై చెప్పుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు.. ఆనందంగా గడిపేందుకు మనకు ఎన్నెన్నో అందమైన పిక్నిక్ స్పాట్‌లు ఉన్నాయి.. అవేంటో ఒకసారి చూసేద్దాం!


అంతర్వేది




ఆంధ్రా కేరళ కోనసీమ


ఓడలరేవు

పచ్చని అందాలకు నెలవు కోనసీమ.. ఎటుచూసినా పచ్చదనమే.. ఏవైపు చూసినా పిక్నిక్ స్పాట్‌గానే ఉంటుంది.. ఎందుకంటే ఆంధ్రా కేరళ.. ఎత్తయిన కొబ్బరిచెట్లు.. పచ్చదనంతో నిండిన చేల మధ్య నుంచి నల్లటి తారు రోడ్లపై వెళుతుంటే ఆ అనుభూతే వేరు.. కేశవదాసుపాలెం, కేశనపల్లి, ఓడలరేవు, వాసలతిప్ప, ఎస్.యానాం బీచ్‌లతో పాటు గోదావరి తీరప్రాంతాలైన యానాం, కోటిపల్లి, ముక్తేశ్వరం, ఆదుర్రు, సోంపల్లి, దిండి రిసార్ట్స్, లొల్లలాకులు తదితర ప్రాంతాలు పిక్నిక్ స్పాట్‌లుగా ప్రసిద్ధికెక్కాయి. వీటితోపాటు ఆధ్యాత్మిక ప్రాంతాలైన అంతర్వేది, అప్పనపల్లి, అయినవిల్లి, మురమళ్ళ, వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. కోనసీమకు ఓవైపు గోదావరి.. మరోవైపు బీచ్ ఉండడం గమనార్హం. కోనసీమకు వెళ్లేందుకు రావులపాలెం, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మీదుగా బస్ సౌకర్యం ఉంది. రావులపాలెం మీదుగా అంతర్వేదికి 65 కి.మీ. ఓడలరేవు అయితే 51 కి.మీ.. పాలకొల్లు నుంచి అంతర్వేది అయితే 26 కి.మీ ఉంటుంది.


తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో శనివారం మహిళల పిక్నిక్ సందడి

'తూర్పు'న అందాలు

అన్ని అందాలు కలగలిపినదే తూర్పుగోదావరి జిల్లా.. ఒకవైపు గోదావరి.. మరోవైపు కడియం పూలతోటలు.. ఇంకోవైపు కోరుకొండలో పాండవుల మెట్ట.. గోకవరంలో సూదికొండ.. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కాటన్‌మ్యూజియం, గోదావరి అందాలు.. పెరవలి మండలం తీపర్రు గోదావరి చెంతనే ఇసుక తిన్నెలు.. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నేఎన్నెన్నో.. ఇక రాజమహేంద్రవరం పట్టణవాసులకు అయితే నగరంలో దివాన్‌చెరువు వద్ద ఉన్న పుష్కరవనం.. లోపలకు వెళితే మళ్లీ రావాలనిపించదు. ఎందుకంటే చుట్టూ చెట్ల మధ్యన పిక్నిక్ అద్భుతం.. బిజీ జీవితం గడిపే పట్టణవాసులకు ఈ పుష్కరవనం ప్రత్యేకమనే చెప్పాలి. ఎందుకంటే ఒకటా రెండా సుమారు 250 ఎకరాలపైనే ఈ పార్కు విస్తీర్ణం. ఒక 20 ఎకరాల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలు ఉంటాయి. తరువాత ఎటు చూసినా పచ్చనిచెట్లు గుబురుగా గుబురుగా పెరిగి ఉంటాయి. తూర్పుగోదావరి జిల్లాలో పిక్నిక్ స్పాట్లకు రాజమహేంద్రవరం నగరం నుంచి ప్రత్యేకంగా బస్ సౌకర్యం ఉంది.. ఇక రాజమహేంద్రవరం రావడానికి విమానయానం, రైలు, బస్ తదితర సదుపాయాలు ఉన్నాయి.

రారండోయ్.. చూసొద్దాం!



ఉమ్మడి జిల్లాలో ఎన్నెన్నో అందాలు

(కాకినాడ/ అమలాపురం/ రాజమహేంద్రవరం సిటీ/ దివాన్‌చెరువు/ కడియం/పెరవలి, ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పిక్నిక్‌ల సందడి నెలకొంది. కార్తీక మాసం కావడంతో ఎక్కడికక్కడ జనం గార్డెన్ పార్టీలతో సందడి చేస్తున్నారు. స్కూళ్లు, కాలేజీలు, వివిధ సామాజికవర్గాలు, కార్మిక సంఘాలు, ఉద్యోగ యూనియన్లు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు ఎవరికివారే పిక్నిక్‌ల బాటపడుతున్నారు. ఆదివారం రోజైతే ఉమ్మడి జిల్లాలో మామిడి, కొబ్బరి తోటలు, గోదావరి గట్లు, పార్కులు పిక్నిక్‌లతో సందడిగా మారుతున్నాయి. కాకినాడలో అయితే సర్పవరం జంక్షన్, ఇంద్ర పాలెం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, తునిరూరల్‌లోని అనేక ప్రైవేటు గార్డెన్లు, గెస్ట్‌హౌస్‌లు, కొబ్బరితోటల్లో పిక్నిక్‌లు భారీగా జరుగు తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో ప్రధానంగా రాజమహేంద్రవరం, కడియం, రాజానగరం తదితర ప్రాంతాల్లో తోటలు, నర్సరీలు గోదావరి ఇసుక తిన్నెలు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరితోటలు, సముద్రతీరం వెంబడి, గోదావరి పాయల వెంబడి ఇసుక మధ్యలో సరదాసరదాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సామాజికవర్గాల వారీగా నిర్వహించే పిక్నిక్‌లు అయితే ఓ భారీ ఈవెంట్‌నే తలపిస్తాయి. డీజేలు, సినిమా నటులతో డ్యాన్సులు, స్థానిక కళాకారులతో స్టెప్పులు, ఆటపాటలతో సందడి చేస్తారు. ప్రధానంగా కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంలో కొన్ని సామాజికవర్గాలు రెండు వారాలుగా భారీస్థాయిలో వీటిని నిర్వహిస్తున్నాయి. కాకినాడలో ఓ కీలక సామాజికవర్గ పిక్నిక్‌లో ఆటపాటల్లో గెలిచినవారికి కారు, బైక్‌లు కూడా గిఫ్టులుగా అందిస్తున్నారు. మిమిక్రీ, కామెడీ పండించే కళాకారులను సైతం పిలిపిస్తున్నారు. కోనసీమ జిల్లాలో తోటల్లో నిర్వహిస్తోన్న పిక్నిక్‌ల్లో సరదాగా కార్డులతోపాటు ఉత్తుత్తి కోడిపందేలు నిర్వహిస్తూ సందడి చేస్తున్నారు. ఇలా ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పిక్నిక్‌ల సందడి హోరెత్తిస్తోంది. మరోపక్క కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు, శంఖవరం మండలాలు, యానాం వద్ద గోదావరి అందాలు, ఏజెన్సీలో మారేడుమిల్లి, చింతూరు, రంపచోడవరం తదితర ప్రాంతాల్లో జలపాతాల వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు వాటర్‌ఫాల్స్ మరింత శోభాయమానంగా మారి పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి.

హరితవనం.. కడియం




కడియం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మనం ఒకటి రెండు రకాలు పూలు చూస్తేనే ముచ్చట పడిపోతాం.. అటువంటిది వందలాది రకాల పూలమొక్కలు విరబూస్తూ ఓ చోట కనిపిస్తే ఆ సుందర దృశ్యం చూడతరమా.. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో నర్సరీల పూలకొలువు. మండలంలో పది గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో 1100 నర్సరీలు ఉన్నాయి. ఇక్కడ పూలు, పండ్లు, ఆర్నమెంటల్, ఔషధ, సెమిషేడ్, క్రీపర్, ఇండోర్, ఔట్‌డోర్, హేంగింగ్ వంటి రకాల మొక్కలు అనేకం ఉంటాయి. కార్మికుల శ్రమ సౌందర్యంతో విరజిల్లే మొక్కలు ఆకుపచ్చని విన్యాసం చేస్తూ పర్యాటకులకు ప్రణమిల్లుతాయి. ప్రకృతి ఒడిలో హరిత శోభగా గోదావరి నదిఒడ్డున వెలసిన కడియం పూలసీమలో ఈ కార్తీక వేళ సేదతీరి ఉసిరిచెట్టు కింద సహపంక్తి వన భోజనాలు చేయడానికి అనేక మంది ఇష్టపడతారు. కడియపులంక జాతీయ రహదారిని అనుకుని ఉంటుంది. రాజమహేంద్రవరం నుంచి 13 కి.మీ ప్రయాణం చేస్తే కడియం చేరుకోవచ్చు. రావులపాలెం మీదుగా అయితే 23 కి.మీ ఉంటుంది. నిరంతరం బస్, ఆటోలు ఉంటాయి.

ఆహా.. ఏమి రుచి..అనరా..

పిక్నిక్ అంటే విందు కీలకం. వెజ్, నాన్‌వెజ్ భోజనాల్లో రకరకాల కమ్మటి వంటలు వేడివేడిగా తినడం అదో ఆనందం. ఈ నేపథ్యంలో పిక్నిక్‌లకు కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలలో కొన్ని హోటళ్లకు భారీ వెజ్, నాన్‌వెజ్ భోజనాల ఆర్డర్లు వస్తున్నాయి. కాకినాడలో ఓ ప్రముఖ వెజ్ హోటల్ ఆదివారం రోజైతే లగేజీ ఆటోల్లో తుని వరకు, ఆ చివరన యానాం వరకు పది నుంచి పదిహేను పిక్నిక్ గ్రూపులకు భోజనాలు అందిస్తున్నాయి. నాన్‌వెజ్ కేటరింగ్‌లకు సైతం గిరాకీ భారీగా ఉంది. రకరకాల నాన్‌వెజ్ వంటకాలు వండి పిక్నిక్ స్పాట్‌ల వద్దకు చేర వేయడం, పిక్నిక్ జరిగే ప్రదేశంలోనే భారీ వంటకాలు సైతం కొందరు చేయించుకుంటు న్నారు. కొందరైతే గోదావరి సమీపంలో పిక్నిక్‌లు చేసుకుంటూ లైవ్ ఫిష్ వండించుకుతింటున్నారు. దీంతో ఆదివారం వస్తే కేటరింగ్ సంస్థలకు భారీ ఆర్డర్లు వస్తున్నాయి. వెజ్‌లో పది రకాల ఐటమ్స్‌కు ప్లేటుకు రూ.250 నుంచి వసూలు చేస్తుండగా, నాన్‌వెజ్ అయితే రూ.400 వరకు వసూలు చేస్తున్నారు. పిక్నిక్‌లో సుష్టిగా భోజనం చేసేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ప్రకృతి చుట్టూ కాకినాడ



చుట్టూ అందాలు.. మధ్యలో కాకినాడ జిల్లా.. ఒకప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రం ఇది.. ఒకవైపు చూపరులను కట్టపడేసే అందమైన ఏజెన్సీ. మరోవైపు కాకినాడనే ఆనుకుని ఉన్న మడ అడవులు.. ఇంకోవైపు యానాం.. మరోవైపు పచ్చని కోనసీమ.. ఇక అందరినీ ఆకట్టుకునే కాకినాడ బీచ్.. ఇంతేనా అనుకోవద్దు.. ఏజెన్సీలో విహరిద్దామని అనుకుంటే ఒకటా రెండా ఏకంగా 8 జలపాతాలు ఉన్నాయి. అన్నీ జలకళతో పర్యాటకులను రారమ్మని పిలుస్తున్నాయి. మరోవైపు అందాల యానాం ఆస్వాదించేందుకు రమ్మంటుంది.. మడ అడవులను తిలకిస్తే ఆ ఆనందమే వేరు.. కాకినాడ జిల్లాకు ఎటు చూసినా అందమే మరి.. ఒకసారి ఆ అందాన్ని ఆస్వాదిద్దాం.. కాకినాడ జిల్లాలోని ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు బస్ సౌకర్యం ఉంది. ఏజెన్సీలోని జలపాతాల వద్దకు వెళ్లాలంటే సొంత వాహనం లేదంటే అద్దెకు మాట్లాడుకుని అయినా వెళ్లాల్సిందే.

మహా పుష్కరవనం


రాజమహేంద్రవరం వద్ద దివాన్‌చెరువులోని పుష్కరవనం

లాలాచెరువు సమీపంలో జాతీయరహదారిని ఆనుకుని దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గోదావరి మహా పుష్కరవనం అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వనంలో వాకింగ్‌ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, హరితవనం, కార్తీకవనం, వెదురుచెట్లు, పిల్లలు ఆడుకునే పార్క్ వంటి సదుపాయాలు ఉన్నాయి. పుష్కరవనంలో ప్రత్యేకించి కార్తీకవనం కూడా ఉంది. ఇందులో దాదాపు 80 వరకూ ఉసిరి చెట్లు ఉంటాయి. ఈ పుష్కరవనంలో వనభోజనాలు చేయాలంటే పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.10 వంతున ప్రవేశరుసుంగా చెల్లించాలి.

అప్పనపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. కార్తీకమాస శనివారం కావడంతో భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కొత్త పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ కట్టలో తలనీలాలను మొక్కుబడిగా సమర్పించుకున్నారు. శనివారం ప్రత్యేకంగా నిర్వహించే సుప్రభాత సేవ, తొలి హారతి, నిత్య కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా శనివారం ఒక్కరోజు రూ.3,16,263 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 6037 మంది భక్తులు దర్శించుకుని 4079 మంది దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా జేసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.


క్యూలో వేచి ఉన్న భక్తులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటుకు
63 వేల మంది దరఖాస్తు

23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ
డిసెంబరు 9 వరకు దరఖాస్తులకు అవకాశం
రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి జిల్లాలో ఈ నెల 6వ తేదీ వరకు 63 వేల మంది పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం పట్టభద్రుల ఓటరు నమోదు, తుది జాబితా ప్రచురణకు సంబంధించిన పురోగతి అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. జిల్లాలోని 22 మండలాల్లో 63 వేల మంది పట్టభద్రులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లలో దరఖాస్తులు సమర్పించారన్నారు. ఈ నెల 23న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని, అదే తేదీ నుంచి డిసెంబరు 9వరకు తిరిగి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. క్లయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబరు 25న పరిష్కరించనున్నట్లు చెప్పారు. అదే నెల 30న పట్టభద్రుల ఓటర్ల జాబితాను ప్రచురిస్తామన్నారు. జిల్లాలో 16 కిలోమీటర్ల పరిధి లోపల 750 మంది ఓటర్లు మించకుండా 95 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తుది జాబితా ప్రచురణ అనంతరం ఓటర్ల సంఖ్యను బట్టి పోలింగ్ కేంద్రాల సంఖ్య ఖరారు చేస్తామన్నారు. డిసెంబరు 9 వరకు అవకాశం కల్పించినందున అర్హత ఉన్న పట్టభద్రులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. బూత్ స్థాయి అధికారులు విచారణ నిమిత్తం ఇళ్లకు వచ్చినప్పుడు ఒరిజినల్ డిగ్రీ ధ్రువపత్రం, ఫారం, గెజిటెడ్ ధ్రువీకరణ పత్రం చూపిస్తే సరిపోతుందన్నారు. పోలింగ్ కేంద్రాలన్నింటినీ ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేశామన్నారు. మండల స్థాయిలో సహాయ ఓటరు నమోదు అధికారులుగా తహశీల్దార్లు వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టి తుదిగా అర్జీలు పరిశీలించిన అనంతరం జిల్లా కేంద్రానికి నివేదిక పంపిస్తారని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.మదన్‌మోహనరావు, డి.రాజేంద్రబాబు (కాంగ్రెస్), దూరి రాజేష్, (బీజేపీ), కారెం వెంకటేశ్వరరావు (సీపీఎం), కేఎస్ఎల్ భవానీ (బీఎస్పీ), సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డీటీ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

డ్రోన్ టెక్నాలజీతో లైడర్ సర్వే

అమలాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తీర ప్రాంతం వెంబడి ఉన్న డ్రైనేజీలు, సముద్రపు ముంపు బెడద నివారణకు డ్రోన్ టెక్నాలజీతో లైడర్ సర్వే నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. పంట పొలాల ముంపును నివారించేందుకు పూర్వపు భౌగోళిక పరిస్థితులు, ప్రస్తుత స్థితిగతులను డ్రోన్ టెక్నాలజీతో అధ్యయనం చేయనున్నట్లు చెప్పారు. సర్వే అనంతరం పూర్వపు, ప్రస్తుత డ్రైనేజీల స్థితిగతులు, సముద్రపు ముంపు భౌగోళిక స్థితిగతులు, గ్లోబల్ వార్మింగ్ శాస్త్రీయ కారణాలు వంటి వ్యత్యాసాలను బేరీజు వేసుకుని ప్రణాళికాబద్ధంగా పంట పొలాలకు ముంపు బెడద లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ముంపు బెడద నివారణతో తీర ప్రాంతం వెంబడి పంట సాగు విస్తీర్ణం మెరుగుపడుతుందన్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్‌లో ఇటువంటి సర్వే నిర్వహించారని ఆ డేటాను కూడా పరిగణలోకి తీసుకోవాలని సర్వే ఆఫ్ ఇండియా అధికారిక సర్వేయర్ సుందరరావును కలెక్టర్ కోరారు. టెక్నికల్ ఫుటేజీ అందించే ఏజెన్సీలను కూడా ఎంపిక చేయాలన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆర్కిటెక్ కిరణ్, జిల్లా డ్రైనేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎన్‌వీవీ కిశోర్, జిల్లా అటవీశాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు, జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పసుపు పీతల హేచరీ నిర్వహణపై చర్చ

అమలాపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం చిర్రయానంలో పసుపు పీతల హేచరీ ఐదు ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో శనివారం రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్, యునైటెడ్ నేషన్స్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం ప్రతినిధి సుదీప్‌లతో సమావేశం నిర్వహించారు. పసుపు పీతల హేచరీ నిర్వహణ తీరుతెన్నుల అమలు, తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌తో వారు క్షుణ్ణంగా చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే హేచరీ ఏర్పాటుకు ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించామన్నారు. దేశ వ్యాప్తంగా ఇటువంటి పసుపు పీతల సీడ్ నర్సరీ తమిళనాడులో మాత్రమే ఉందని, రెండోదిగా చిర్రయానంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పసుపు పీతల సీడ్ ద్వారా అధిక దిగుబడులతో రైతులు ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. ప్రభుత్వపరంగా క్షేత్రస్థాయిలో అధికారుల బృందం పూర్తిస్థాయి అధ్యయనం చేశారని రూ.2.75 కోట్ల అంచనా వ్యయంతో హేచరీని నిర్మించనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. పసుపు పీతలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని స్పష్టం చేశారు. హేచరీ ఏర్పాటు ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సమావేశంలో మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయ ఉన్నతాధికారి ఉష, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

'మందపల్లి' కిటకిట


మందపల్లి ఆలయంలో పూజలు

కొత్తపేట, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,75,291ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లిలో భక్తుల సందడి

వార్త..6లో

కుండలేశ్వరం.. అంతర్వేది ఆలయాల్లో భక్తజన సంద్రం

6లో



నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

రాక్షస దారులు!



రోడ్డు ప్రమాదాల్లో బతుకులు ఛిద్రం.. కొంపముంచుతున్న అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారుల అతివేగం.. కునుకుపాటు

రోడ్డుపైకి వస్తే క్షేమంగా ఇంటికి చేరుతామన్న భరోసాపోయింది. ఏ క్షణం గుండె గుభేల్‌మనే దుర్వార్త వినాల్సి వస్తుందో అంచనా వేయలేని దుస్థితి దాపురించింది. రహదార్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో నిర్లక్ష్యం, అతి వేగం, కునుకుపాటు, రోడ్లపై గుంతలు, హెల్మెట్, సీటు బెల్టు ధరించడంలో ఏమరుపాటు.. ఇలా కారణాలేమైనా కుటుంబాలు మాత్రం ఛిద్రమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు జీవితాల్లో తీరని శోకాన్ని క్షణకాలంలో తీసుకొచ్చేస్తున్నాయి. బ్లాక్ స్పాట్లలో కూడా కనీసం సదుపాయాలు తీసుకోలేని నిర్లిప్తతలో యంత్రాంగం ఉంటే.. ఇటు వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఏ లేను (వరుస)లో ఏ వాహనం, ఎంత వేగంతో వెళ్లే వాహనం వెళ్లాలో కూడా 99 శాతం మందికి అవగాహన లేదు. సూచికలున్నా పట్టదు. వెరసి నవంబరు మూడో ఆదివారం నిర్వహించే రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం రోజున రహదార్లకు బలైపోయిన వారిని స్మరించుకోవడం తప్ప పరిస్థితుల్లో మార్పు కనిపించదు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదమంటే ఒక వ్యక్తి మరణమో, లేదా కొందరు క్షతగాత్రులుగా మిగలడం కాదు.. ఏదైనా ప్రమాదంలో కుటుంబాలకు ఆధారమైన వారు చనిపోతే.. ఇక ఆ కుటుంబాలకు దిక్కులేకుండాపోతుంది. అప్పటిదాకా సంతోషంగా సాగిపోతున్న వారి జీవితాలు అల్లకల్లోలమైపోతాయి. పిల్లలు అనాథలైపోతారు. నిత్యం ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతుండగా, మరెంతో మంది తీవ్రంగా గాయపడి మంచానపడుతున్నారు. అప్పుడు కూడా ఆ కష్టాన్ని భరించాల్సింది వారి కుటుంబమే. ఇలా బాధిత కుటుంబాలు చిన్నాభిన్నమౌతున్నాయి. కొందరి నిర్లక్ష్యం, నిద్రమత్తు, మద్యం, అతి వేగం, రోడ్లు ఛిద్రమై ప్రమాదాలు జరుగుతున్నాయి. జరుగుతుంటే మరి కొన్ని ప్రమాదాలు రహదారులు ఛిద్రమై గోతులమయం కావడంతో జరుగుతున్నాయి. కారణమేదైనా మూల్యం మాత్రం బాధితులతోపాటు వారి కుటుంబాలు మోస్తున్నాయి.

● మృత్యు కేంద్రాలు.. బ్లాక్ స్పాట్స్

రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా జాతీయ రహదారుల్లోనే జరుగుతుంటాయి. దానికి కారణాలు అనేకం. ఇలా తరచు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తారు. చివరి మూడేళ్లలో రోడ్డులోని 500 మీటర్ల నిడివి (స్ట్రెచ్)లో ప్రమాదాలు జరిగి 5 మరణాలు లేదా 10 మరణాలు లేదా అదే సంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తే అక్కడ పలు శాఖలకు చెందిన అధికారులు సర్వే చేసి బ్లాక్ స్పాట్‌గా గుర్తిస్తారు. దీంతో ఆ ప్రాంతంలో కచ్చితంగా రక్షణ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సవ్యంగా సాగితే బ్లాక్ స్పాట్‌గా కేంద్రం రిజిస్టర్ చేస్తుంది. వెంటనే ఆ ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టడానికి రూ.25 లక్షలు విడుదల చేస్తుంది. దానికి రాష్ట్ర ప్రభుత్వం కొంత జత చేయడం ద్వారా తక్షణ రక్షణ చర్యలు చేపట్టి సూచన, హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, క్యాట్‌ఐస్ (రిఫ్లెక్టింగ్ స్టడ్స్), థర్మోప్లాస్టిక్ రోడ్ మార్కింగ్స్, స్పీడ్ బ్రేకర్లు, సరిపడా లైటింగ్, ముందు కొంత దూరంలో బ్లాక్ స్పాట్ ఉందని.. వేగం నియంత్రించుకొని జాగ్రత్తగా వెళ్లాలనే బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

● ప్రమాదాలకు కారణాలివేనా..

బ్లాక్‌స్పాట్లు గుర్తించిన తర్వాత ప్రధానంగా ఆర్ అండ్‌బీ, నేషనల్ హైవేస్, విద్యుత్తు, ఆర్టీఏ, మునిసిపల్ కార్పొరేషన్, పోలీస్ విభాగాల పాత్ర ఎక్కువగా ఉంటుంది. అవసరమైన విద్యుత్తు, రోడ్డు మార్కింగులు, బోర్డుల ఏర్పాటు ఆ శాఖల పనే. పోలీసులు ఆయాచోట్ల స్టాపర్ బోర్డులు వంటివి ఏర్పాటుచేయడం, సిబ్బందిని కాపలాగా ఉంచడం చేస్తారు. శాఖల మధ్య సమన్వయ లోపం, ఆయా శాఖలు చేయాల్సిన రక్షణ పనుల్లో తీవ్ర అలసత్వం వల్ల బ్లాక్ స్పాట్లు మరిన్ని ఎక్కువగా పుట్టుకొస్తున్నాయి. అలాగే.. వాహన చోదకుల మితిమీరినతనం కూడా ప్రాణాలు కోల్పోయేలా చేస్తోంది. అతివేగం, నిద్రమత్తు, వచ్చీరాని డ్రైవింగ్, మద్యం సేవించి నడపడం, మలుపుల్లో, ఏదైనా అకస్మాత్తుగా ఎదురైతే అదుపు చేసుకోలేకపోవడం, రాంగ్‌రూట్‌లో వెళ్లడం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం, అవగాహన ఉన్నా నిర్లక్ష్యం, వాహనాలు కండీషనల్‌లో లేకపోవడం, రాత్రి వేళల్లో హైవేపై వాహనాలు నిలిపినా భద్రతా సిబ్బంది పట్టించుకోకపోవడం వంటి కారణాలు ప్రజల ఊపిరిని ఆపేస్తున్నాయి.

● ఏం చెయ్యొచ్చు

జాతీయ రహదారులు లేదా రెండు లేన్లు, సింగిల్‌లేన్(వరుస) రోడ్లపై స్పీడుగా వెళ్లే, నింపాదిగా వెళ్లే, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు, కార్లు ఏవి ఏ లేనులో వెళ్లాలో ఇప్పటికీ అధికశాతం మంది వాహనదారులకు అవగాహన లేదు. దీనిపై విస్తృతంగా చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది. టోల్‌గేట్ల వద్ద ఫోన్ నంబరు తీసుకొని ఆయా వాహనదారులను అప్రమత్తం చేసేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణపై మెసేజ్‌లను పంపొచ్చు. హెల్మెట్, సీటుబెల్టు తప్పనిసరిగా ధరించే విధంగా ప్రజలకు అవగాహన కలిగించవచ్చు. అతి వేగంగా వెళ్లేవాళ్లకు కౌన్సెలింగ్, అవసరమైతే కేసులు నమోదు చేయాలి. రోడ్లపై ఇష్టానుసారం పార్కింగ్ చేసే వాహనాలపై కఠినంగా వ్యవహరించవచ్చు. రోడ్ల పక్కన ప్రమాద నివారణ సూచన, హెచ్చరిక బోర్డులను విస్తృతంగా ఏర్పాటుచేయాలి. గతంలో రాత్రి 12 గంటల నుంచి వాహన డ్రైవర్లను పోలీసులు గమనించేవారు. 2గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య డ్రైవర్ల ముఖాన్ని నీటితో కడిగించడం చేయించేవారు. సిబ్బంది కొరత వేధిస్తున్న పోలీసు శాఖకు ఇలాంటివి వీలుపడడం లేదని తెలుస్తోంది.

'తూర్పు'లో పది నెలల్లో 243 మంది మృతి.. 626 మంది క్షతగాత్రులు

తూర్పుగోదావరి జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు నమోదవుతున్నాయి. జాతీయ రహదారుల పరిధి ఉన్న ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు రోడ్డు ప్రమాదాల కేసుల నమోదు, దర్యాప్తు, విచారణలు ప్రహసనంగా మారుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ గణాంకాలు పరిశీలిస్తే జిల్లాలోని 595 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా ఏకంగా 243 మంది ప్రాణాలు బలైపోయాయి. 626 మంది ఆస్పత్రి పాలయ్యారు. రాజానగరం, బొమ్మూరు, దేవరాపల్లి, నల్లజర్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ 10 నెలల్లో 110 మంది విగత జీవులయ్యారు. ఇంచుమించు జాతీయ రహదార్లతో రాష్ట్ర రహదారులు ప్రమాదాల్లో పోటీపడుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లోని మరణాలు కుటుంబ సభ్యులను నిర్జీవంగా చేస్తుంటే.. గాయాలపాలైన వాళ్లలో చాలామంది మంచానికి, వీల్‌చైర్లకు పరిమితమై జీవితమంతా నరకం చూస్తున్నారు.

2024 జనవరి నుంచి అక్టోబరు వరకు..

స్టేషన్	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
వన్‌టౌన్	17	4	18
త్రీటౌన్	52	9	65
ప్రకాశ్‌నగర్	17	5	20
టూటౌన్	20	5	20
ధవళేశ్వరం	36	7	37
కడియం	30	9	43
రాజానగరం	45	29	26
కోరుకొండ	27	12	23
గోకవరం	23	7	29
సీతానగరం	10	5	8
బొమ్మూరు	46	25	36
అనపర్తి	13	3	14
బిక్కవోలు	14	4	17
రంగంపేట	10	5	8
కొవ్వూరుటౌన్	46	15	68
కొవ్వూరురూరల్	17	10	28
చాగల్లు	13	02	16
తాళ్లపూడి	13	4	12
గోపాలపురం	17	8	19
దేవరపల్లి	33	34	28
నిడదవోలు	15	3	17
సమిశ్రగూడెం	17	08	18
ఉండ్రాజవరం	07	02	05
పెరవలి	20	06	21
నల్లజర్ల	37	22	30
మొత్తం	595	243	626

కాకినాడ జిల్లాలో పది నెలల్లో 235 మృతులు

కాకినాడ క్రైం నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జనవరి నెల నుంచి అక్టోబరు నెల వరకు జిల్లావ్యాప్తంగా 220 ఘోర ప్రమాదాలు చోటుచేసుకోగా 235 మంది మృత్యువాతపడ్డారు. వారిలో 204 మంది పురుషులుకాగా 31 మంది మహిళలు. అలాగే మరో 97 రోడ్డు ప్రమాదాల్లో 134 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. అలాగే 348 ప్రమాదాల్లో 656 మంది గాయాలపాలయ్యారు. గత ప్రభుత్వం ఛిద్రమైన రహదారుల పట్ల శ్రద్ధ వహించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో పెద్ద సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పలు ప్రజాసంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్దను రోడ్డు ప్రమాదాలు మింగేస్తుంటే ఆయా కుటుంబాలు రోడ్డునపడి తేరుకోలేకపోతున్నాయి. బాధిత కుటుంబాల ఆర్థిక స్థితి పూర్తిగా మారిపోయి దీనస్థితిలోకి వెళ్లిపోతున్నారు. అనేకమంది భార్యాభర్తలు చనిపోయి పిల్లలు అనాథలవుతున్నారు. ఈ ప్రమాద విషాదాలు ఆయా కుటుంబాలను జీవితాంతం వెంటాడుతున్నాయి. కాగా కాకినాడ జిల్లా పోలీసులు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న రహదారుల్లో 55 బ్లాక్‌స్పాట్లను గుర్తించి నిరంతర భద్రతను ఏర్పాటుచేశారు. అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.



నిరాశ్రయులుగా.. మిగిలిపోయారు!

2024 జనవరి 30న తేటగుంట హైవే కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తేటగుంటకు చెందిన గొర్ల నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆంధ్రజ్యోతి పలకరించింది. రోజువారీ కూలీగా ఉన్న నాగేశ్వరరావుపై భార్య, ముగ్గురు పిల్లలు, ఆయన తల్లి ఆధారపడి జీవించేవారు. ప్రమాదంలో ఇంటి యజమాని మరణించడంతో కుటుంబ మొత్తం నిరాశ్రయులుగా మిగిలామని వారు చెప్పారు. బీమాగానీ, ఆర్థిక సాయంగానీ అందకపోవడంతో భార్య పాపారత్నం రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషిస్తోంది.

- తుని రూరల్/ఆంధ్రజ్యోతి



ప్రత్తిపాడు గోవిందపురం కొండ జంక్షన్ వద్ద ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

● 'తూర్పు'లో రోడ్డు.. ప్రమాదాలిలా..

రహదారి	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
ఎన్‌హెచ్ 216(ఏ)	55	28	49
ఎన్‌హెచ్ 16	120	62	140
ఎన్‌హెచ్ 516(ఈ)	39	17	36
365బీబీ	15	08	14
516డీ	13	07	14
స్టేట్ హైవేలు	212	65	227
ఇతర రోడ్లు	141	40	146
మొత్తం	595	243	626



తాళ్లూరులో జరిగిన ప్రమాదం(ఫైల్)

డేంజర్..డేంజర్

మురారి-నీలాద్రిరావుపేట పరిధిలో ఎక్కువ ప్రమాదాలు

గండేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలంలో మురారి గ్రామం నుంచి నీలాద్రిరావుపేట గ్రామం వరకు సుమారు 19 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మల్లేపల్లి గ్రామ శివారులో కొన్నేళ్ల క్రితం పశ్చిమగోదావరికి చెందిన ఐదుగురు కళాకారులు మృతిచెందారు. ఇటీవల మురారి గ్రామ శివారులో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన ముగ్గురు అన్నాదమ్ముళ్లు మృతిచెందారు. అలాగే తెలంగాణకు చెందిన బావాబామ్మర్దులు ఇటీవల మృత్యువాతపడ్డారు.

ప్రమాదాలు జరిగే స్పాట్‌లు

మురారి నుంచి నీలాద్రిరావుపేట వరకు ఏడు గ్రామాలుండగా 15కి పైగా డివైడర్లు ఉన్నాయి. మురారి, మల్లేపల్లి, గండేపల్లి, జడ్.రాగంపేట, తాళ్లూరు డివైడర్ల వద్ద మలుపులు ఎక్కువగా ఉం డడంతో గ్రామస్తులు వాహనాలు గమనించకపోవడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో హైవేపై విద్యుత్ లైట్లు వెలగకపోవడం, దాబా రెస్టారెంట్ల వద్ద వాహనాలు నిలిపివేయడం, వర్షాకాలంలో గోతుల్లోకి నీరు చేరడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

గస్తీ ముమ్మరం చేశాం



రాత్రి వేళల్లో హైవేపై గస్తీ ముమ్మరం చేశాం. నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే బ్లాక్‌స్పాట్‌లు గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టిస్తున్నాం. ● గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు

రోడ్డున పడ్డ కుటుంబాలు

ప్రత్తిపాడు,నవంబరు16(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో 16 కిలోమీటర్ల పైబడి జాతీయ రహదారి విస్తరించింది. గత జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృత్యువాత పడ్డారు. 50 మంది గాయపడ్డారు. ముఖ్యంగా పాదాలమ్మ తల్లి గుడి వద్ద ముగ్గురు లారీ డ్రైవర్లపై రాజమండ్రి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు దూసుకువెళ్లిన ఘటనలో ముగ్గురు డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే గుడి వద్ద పని చేసే వ్యక్తిని కూడా అదే బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. గోవిందపురం కొండ జంక్షన్, నరేంద్రగిరి జంక్షన్, చెక్‌పోస్టు సెంటర్, సుద్దగడ్డ బ్రిడ్జి, రాచపల్లి అడ్డురోడ్డు, ధర్మవరం బైపాస్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్ సెంటర్, నిడిగట్ల వంతెన సెంటర్లలో ఎందరో మృతిచెందారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి.





ఎన్నెన్నో అందాలు...

1. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి నుంచి ధారపల్లి దారి మార్గంలో కనిపించిన ప్రకృతి సోయగం. 2. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధారపల్లి కొండల మధ్యలో నుంచి చూపరులను కనువిందు చేసిన జలపాతం.



స్ఫటిక లింగానికి పూజ చేస్తున్న మంత్రి సుభాష్



లింగానికి మొక్కుతున్న మంత్రి రామానాయుడు

స్ఫటికలింగానికి మంత్రుల పూజలు

పెరవలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులోనున్న శివాలయం వద్ద స్ఫటిక లింగాన్ని శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దర్శించుకున్నారు. కార్తీకమాసం సందర్భంగా స్ఫటికలింగ దర్శనాన్ని భక్తులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులతోపాటు మంత్రులు సుభాష్, రామానాయుడు స్ఫటిక లింగాన్ని దర్శించుకుని పూజలు చేశారు. సంవత్సరంలో మూడుసార్లు మాత్రమే దర్శనానికి అవకాశం ఉంటుందని మిగతా రోజుల్లో కోనేరులో ఈ శివలింగాన్ని ముంచి వేస్తామని ఆలయ అధికారి తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో కుండలేశ్వరస్వామి

కుండలేశ్వరంలో ప్రత్యేక పూజలు

కాట్రేనికోన, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరంలో శనివారం స్వామి వారిని దర్శించుకునేందుకు బారులుతీరారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలు చేసి గోదావరిమాతకు పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో చెయ్యేరుకు చెందిన మంతెన మమ్ముర్రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో 2000 మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో త్సవటపల్లి నాగు, నంద్యాల వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ భద్రరావు, మోటిపల్లి శ్రీను, సలాది సతీష్, చిక్కం ఆనంద కుమార్, అడపా శివ, అడపా వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ శంకర్, మీసాల బాల చంద్రరావు పాల్గొన్నారు.

భక్తులతో వాడపల్లి ఆలయం కిటకిట

● ప్రత్యేక అభిషేకాలు, పూజలు ● స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.41.53 లక్షలు

ఆత్రేయపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తడంతో కిక్కిరిసింది. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను జరిపి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు జరిపి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించి అన్నప్రసాదంలో పాల్గొన్నారు. అరకు ఎమ్మెల్యే ఆర్.మత్స్యలింగం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు స్వామివారి చిత్రపటం అందించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒకరోజు ఆదాయం రూ.41.53 లక్షలు వచ్చినట్టు ఉప కమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.





ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి. పక్క చిత్రంలో స్వామివారి ఆలయంలో భక్తుల సందడి



పెద్దాపురం శృంగారవల్లభస్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శృంగారవల్లభస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తజనం



శృంగారవల్లభ స్వామివారు

పెద్దాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,38,620, అన్నదాన విరాళాలు రూ.85,895, కేశఖండన ద్వారా రూ.5,560, తులాభారం, కానుకల ద్వారా రూ.500, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ.28,665 వెరసి రూ.3,59,240 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. స్వామి వారిని సుమారు 8 వేల మందికి పైగా భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయంలో భక్తుల సందడి

అంతర్వేది, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తడంతో సందడి నెలకొంది. స్వామివారి నిత్యాభిషేకం, సుదర్శన హోమాల్లో భక్తులు పూజలు చేశారు. ఆలయం లోపల వేపచెట్టు చుట్టూ కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి ముడుపులు కట్టారు. అయ్యప్ప మాలధారులు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని నిత్యాన్నదానంలో పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం: నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన కొప్పిశెట్టి వెంకటరమణ, కుటుంబ సభ్యులు రూ.1,11,116 విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి చేతులమీదుగా అందించినట్టు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది కిరణ్, గుత్తుల శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద దర్శనానికి బారులుతీరిన భక్తులు



పిఠాపురం పాదగయ క్షేత్రంలో సాధారణ పరిపాలనాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వాణీమోహన్

పాదగయలో ప్రిన్సిపల్ కార్యదర్శి పూజలు

పిఠాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని సాధారణ పరిపాలనాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వాణీమోహన్ శనివారం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. వాణీమోహన్‌కు ఆలయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ప్రసాదాలు, అమ్మవార్ల ఫోటోను అందజేశారు.



సామర్లకోట భీమేశ్వరాలయంలో హైకోర్టు జడ్జి జయసూర్య దంపతులు

భీమేశ్వరాలయంలో హైకోర్టు జడ్జి పూజలు

సామర్లకోట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జడ్జి నైనాల జయసూర్య సతీసమేతంగా శనివారం కాకినాడజిల్లా సామర్లకోట కుమారరామభీమేశ్వరస్వామిని, బాలాత్రిపుర సుందరి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హైకోర్టు జడ్జి జయసూర్య దంపతులకు ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా ఆలయం ఆవరణలో అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించారు. భీమేశ్వరస్వామికి అభిషేకపూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పండితులచే వేదాశీర్వచనం పొంది స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందుకున్నారు.

క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్ : డీఈవో

● కాకినాడలో ఉత్సాహంగా రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

కాకినాడ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని కాకినాడజిల్లా డీఈవో పి.రమేష్ అన్నారు. కాకినాడ డీఎస్ఏ మైదానంలో శనివారం పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్19 హాకీపోటీలు ప్రారంభమయ్యాయి. సమాఖ్య జిల్లా కార్యదర్శి లంకా జార్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈనెల 16 నుంచి 18వరకు మూడు రోజులపాటు నిర్వహించే పోటీల్లో ఏరోజుకారోజు విజేతలను ప్రకటిస్తారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, డీవైఈవో ఎస్.వెంకటేశ్వరరావు, హాకీ క్రీడాకారుడు దాసరి మురళీకృష్ణ, పరిశీలకుడు సెల్వపాండియన్, హాకీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.రవిరాజు, పీఈటీ సంఘ జిల్లా కార్యదర్శి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మొదటిరోజు విజేతలు వీరే

బాలికల్లో గుంటూరు జట్టుపై 11పాయింట్ల తేడాతో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. నెల్లూరుపై అనంతపూర్(0.5), గుంటూరుపై విజయనగరం(0.2), ప్రకాశంపై కర్నూలు (0.1), కర్నూలుపై అనంతపూర్ 0.9. పశ్చిమగోదావరిపై కృష్ణా 0.1, విజయనగరంపై తూర్పుగోదావరి0.11, శ్రీకాకుళంపై కడప 0.7, నెల్లూరుపై కర్నూలు 0.1, పశ్చిమగోదావరిపై విశాఖ0.1 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. బాలుర విభాగంలో శ్రీకాకుళంపై తూర్పుగోదావరి 0.5, విజయనగరంపై అనంతపురం 0.17, కర్నూలుపై కృష్ణా 0.2, శ్రీకాకుళంపై నెల్లూరు0.3, చిత్తూరుపై అనంతపురం 0.2, కృష్ణాపై విశాఖజట్లు 0.7 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి.



రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభిస్తున్న డీఈవో రమేష్



గౌరవ వందనం ఇస్తున్న క్రీడాకారులు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా?

● అసెంబ్లీ సమావేశాలే కారణమా?



మండపేట మండలం తాపేశ్వరం లాకులు

మండపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ విరామం తర్వాత సాగునీటి సంఘాలకు జరిగే ఎన్నికలు ఈనెల 23న నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసినట్టు సమాచారం. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో నీటిసంఘ ఎన్నికలు డిసెంబరు 8న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 990 మంది సభ్యులు సంఘాల్లో ఉంటారు. వీరంతా నీటిసంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 14, ప్రాజెక్టు కమిటీ 1కి సంబంధించి ఈనెల 23న ఎన్నికలు జరగాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని వాయిదా వేశారు. డిసెంబరు 8న నిర్వహిస్తారా లేక మరో సారి వాయిదాపడతాయనే విషయం ప్రభుత్వం స్పష్టం చేయాల్సి ఉంది. ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ కానప్పటికీ ఎన్నికలు వాయిదా వేస్తున్నామన్న సమాచారం మాత్రం అధికారులకు చేరింది. దాంతో సాగునీటి సంఘాలు వాయిదా పడ్డాయని అధికారులు చెబుతున్నారు. ఇదిలావుంటే వైసీపీ ప్రభుత్వం నీటి సంఘాలను రద్దుచేయటంతో ఐదేళ్లపాటు సంఘాల ఊసు లేదు. పంటకాల్వల ఆధునికీకరణకు కాణిపైసా కూడా విదల్చలేదు. తిరిగి ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తిరిగి నీటి సంఘాలు తెరపైకి వచ్చాయి. గతంలో ఇక్కడ సంఘాల తరఫున డీసీ, ప్రాజెక్టు కమిటీల తరఫున పనిచేసిన వారే ఇపుడు తిరిగి సాగునీటి సంఘాల అధ్యక్ష పదవుల కోసం పోటీపడుతున్నారు. మొత్తంమీద సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన ఏకగ్రీవంగా నీటిసంఘాలను తమ ఖాతాలో వేసుకోవాలని గట్టిప్రయత్నాలు చేస్తున్నారు. సాగునీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలు ఎపుడు జరుగుతాయని ఇరిగేష్ ఉన్నతాధికారిని ప్రశ్నించగా ఈనెల 23న జరగాల్సిన ఎన్నికలు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందుకు ప్రస్తుతం వాయిదా వేస్తున్నట్టు తమకు సమాచారం అందిందని ఎపుడు ఎన్నికలు జరుగుతాయనేది స్పష్టమై ఆదేశాలు తమకు ఇంకా చేర లేదని ఆయన చెప్పారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

● వీధినపడ్డ ఇద్దరు ఆడపిల్లలు, భార్య



మట్టిలో కూరుకుపోయిన శ్రీనుబాబు,



శ్రీనుబాబు(ఫైల్)

రౌతులపూడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటుకబట్టీలో మట్టితొక్కుతుండగా ట్రాక్టర్ తిరగబడి మృతి చెందిన సంఘటన రౌతులపూడి మండలం బంగారయ్యపేటలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం బంగారయ్యపేట గ్రామానికి చెందిన పబ్బిరెడ్డి శ్రీను బాబు (38) గ్రామశివారున గల విరవాడకు చెందిన దిబిడి కృష్ణార్జున్ ఉదయం 6గంటల సమయంలో ఇటుక బట్టీలో ట్రాక్టర్‌తో మట్టిని తొక్కుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి తిరగబడి మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. శ్రీనుబాబు కూలిపని చేసుకుంటూ ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భర్త మృతితో ఇద్దరు ఆడపిల్లలను తాను ఎలా పోషించాలంటూ భార్య రోదిస్తోంది. రౌతుల పూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జైలులో కలిశారు.. చోరీలు చేస్తున్నారు!

● సాగిపాడు చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

● రెండు వారాల్లో కేసు ఛేదించిన పోలీసులు

● 40 కాసులు బంగారం.. రూ.2.70 లక్షలు స్వాధీనం



సాగిపాడు చోరీ కేసులో అరెస్టు చేసిన వ్యక్తులతో పాటు 40 కాసుల బంగారం స్వాధీనం చేసుకున్న పోలీసులు

గోపాలపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం పోలీసులు రెండు వారాల్లోనే చోరీ కేసును ఛేదించి ముగ్గురిని శనివారం అరెస్టుచేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం సాగిపాడుకు చెందిన భమిడిపాటి శ్రీనివాస్ ఈనెల 2వ తేదీన ఊరెళ్లాడు. ఆ సమయంలో అతని భార్య శారద, అత్తగారు గరిమెళ్ళ సూర్యకాంతం ఉన్నారు. ఇద్దరు వ్యక్తులు మాస్కు, ముసుగులు ధరించి ఒక్కసారిగా ఇంట్లో ప్రవేశించారు. ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళలు అడ్డుకోవడానికి ప్రయత్నించగా దాడి చేశారు. అనంతరం 40 కాసుల బంగారం, రూ.2.70 లక్షలు నగదు పట్టుకుని పరారయ్యారు. ఈ మేరకు సమాచారం అందడంతో శ్రీనివాస్ ఇంటికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఏడు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. గోపాలపురం శివారు దుర్గమ్మగుడి వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి విచారించారు. ఎట్టకేలకు చోరీ కేసులో ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం పాతకొండగూడెం గ్రామానికి చెందిన చీకట్ల సతీష్(పండు), షేక్ అబ్దుల్ బాదుల్లా షరీఫ్(జంగారెడ్డిగూడెం), గోపాలపురం మండల తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నక్కా కిషోర్ బాబులను శనివారం ఉదయం అరెస్టు చేశారు. ఏలూరు జిల్లాకు చెందిన ఇద్దరు అంతర జిల్లా నేరస్తులని.. గతంలో జైలుకు వెళ్లివచ్చారు. నక్కా సతీష్‌బాబు ఆయిల్ చోరీ కేసులో సెంట్రల్ జైలులో ఉన్నాడు. జైలులో ఏర్పడిన పరిచయంతో ముగ్గురు స్నేహితులుగా మారారు. అనుపానులు గమనించి చోరీలు చేయడం అలవాటుగా చేసుకున్నారు. గోపాలపురం ఘటనలో పోలీసులకు చిక్కారు. ముగ్గురిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి శనివారం కొవ్వూరు కోర్టుకు తరలించినట్టు దేవరపల్లి సీఐ పి.నాగేశ్వరరావు నాయక్, ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ కేసును ఛేదించిన పోలీసులను సిబ్బందిని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించినట్టు తెలిపారు.

అన్నవరం దేవస్థానం సిబ్బంది సమష్టి కృషితోనే

గిరిప్రదక్షిణ, పౌర్ణమి వేడుకలు విజయవంతం



ఈవో రామచంద్రమోహన్‌ను అభినందిస్తున్న దేవస్థానం ఉద్యోగులు

అన్నవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకలు, సుమారు రెండు లక్షల మంది భక్తులు పాల్గొన్న గిరిప్రదక్షణ కార్యక్రమం సిబ్బంది సమిష్టికృషితోనే విజయవంతమైందని ఈవో రామచంద్రమోహన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం కార్యక్రమం విజయవంతం కావడంతో ఆయనను అభినందించగా ఈవోపై వ్యాఖ్యలు చేశారు. తాను గతేడాది అనుభవాలు దృష్ట్యా మార్పులు మాత్రమే చేశానని ప్రతిఒక్క ఉద్యోగి శ్రమించారని అన్నారు. మున్ముందు ఇదే ఐక్యతతో పనిచేయాలని సూచించారు. ఈవోకు వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సి.హెచ్. రామ్మోహనరావు, ఈఈ రామకృష్ణ, ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, ఐ.వి.రామారావు, అనకాపల్లి ప్రసాద్, కంచి మూర్తి, కంచిభట్ల రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ లెక్కల రమేష్ తదితరులు ఉన్నారు.

'పసుపు పీతలు సాగుకు అనుకూలం'



స్థలాన్ని పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్

కాట్రేనికోన, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చిర్రయానాంలో పసుపు పీతల హేచరీకి కేటాయించిన ఐదెకరాల భూమిని శనివారం మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్ పరిశీలించారు. రైతులు మాట్లాడుతూ తమిళనాడు హేచరీ నుంచి పీత ఒక్కంటికి రూ.12కు కొని, మూడు రూపాయలు రవాణా ఛార్జీ చెల్లిస్తున్నామన్నారు. 1300కి.మీ ప్రయాణం కారణంగా 50శాతం పిల్లలు చనిపోతున్నాయన్నారు. స్థానికంగా పసుపు పీతల పిల్లలను ఉత్పత్తి చేస్తే పీతల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఇది మొదటి ప్రాజెక్టుగా నిలుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్, జేసీ, ఆర్డీవో చొరవ తీసుకుని కేవలం 15రోజుల్లో హేచరీకి భూమిని కేటాయించడం ఆనందదాయకమన్నారు. రూ.2.75 కోట్ల అంచనాతో ప్రాజెక్టును ప్రతిపాదించడం సంతోషంగా ఉందన్నారు. కమిషనర్ డోలాశంకర్ మాట్లాడుతూ అందరి సహకారంతో నాలుగు నెలల్లో హేచరీని నెలకొల్పుతామన్నారు. ఇక్కడి వాతావరణం పీతల సాగుకు అనుకూలంగా ఉందని ఆయన అన్నారు. యునైటెడ్ నేషన్స్ అభివృద్ధి ప్రోగ్రాం ప్రతినిధి సుదీప్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.శ్రీనివాస్, మత్స్యశాఖ సహాయసంచాలకుడు ఎల్బీఎస్ వర్ధన్, ఎఫ్‌డీవో గోపాలకృష్ణ, గ్రామ మత్స్యశాఖ సహాయకులు లోవరాజు, బాలయోగి, మీనాకుమారి, రవికిరణ్ పాల్గొన్నారు

పుష్కరాలు-2027కి ప్రత్యేక కమిటీలు

● తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే 2027 గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కర ముందస్తు ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం సమీక్షించారు. రాబోయే గోదావరి పుష్కరాలకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తారని, అందుకు అనుగుణంగా నియమించిన కమిటీలన్నీ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆయా శాఖలవారీ చేపట్టే పనుల ప్రాధాన్యతానుసారం ఒక్కొక్క కమిటీని నియమిస్తున్నామన్నారు. ట్రాఫిక్, హెల్త్ అండ్ శానిటేషన్, ఫుడ్‌కమిటీ, సర్వేలెన్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, పుష్కరనగర్ కమిటీ, డిజాస్టర్ కమిటీ, ప్రొటోకాల్, ఎగ్జిబిషన్, చైల్డ్ అండ్ లేబర్ కమిటీ, టెలికమ్యూనికేషన్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల పరిధిలో మున్సిపల్ అధికారులు, రూరల్ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అంశాలపై కొవ్వూరు, రాజమహేంద్రవరం ఆర్డీవోలు ప్రజంటేషన్లు సిద్ధం చేయాలన్నారు. గత పుష్కరాల కంటే 2027 నాటి పుష్కరాలకు ప్రత్యేక బస్‌లు సిద్ధం చేసుకోవాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆయా అధికారిక కమిటీలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జేసీ చిన్నరాముడు, కమిషనర్ కేతన్‌గార్గ్, డీఆర్వో సీతారామమూర్తి, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బారావు, టీటీవో ఆర్.సురేష్, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, కొవ్వూరు ఇన్‌చార్జి ఆర్డీవో కెఎల్.జ్యోతి, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్‌బాబు పాల్గొన్నారు.

గాలి నాణ్యతను పెంపొందించేందుకు చర్యలు

వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ పరిశీలించిన కమిషనర్



వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో భాగంగా గాలి నాణ్యతను పెంచడానికి అన్నిచర్యలు తీసుకుంటున్నామని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఎన్క్యాప్ నిధులతో కొనుగోలుచేసిన వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా మంచినీటిని గాలిలోకి చల్లడం ద్వారా గాలిలోని కాలుష్యాన్ని తగ్గించవచ్చని, దుమ్ము, విసర్జిత పదార్థాలు తగ్గుతాయన్నారు. వాహనంపై స్ప్రే చేసే మిషన్ ఏర్పాటు చేశామని, దాని ద్వారా నీటిని చల్లుతామని నిరంతరాయంగా రెండుగంటలు పని చేస్తుందన్నారు. కాలుష్య ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనం ద్వారా నీటిని వెదజల్లాలని అందుకోసం నెలకు పరిపడా షెడ్యూల్ తయారు చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ వాహనం మీద పనిచేయడానికి వీలుగా డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఐ.పాండురంగారావు, జీపీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవీ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



మృతుడు సాయిబాబు

ముమ్మిడివరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిగా ఉండి అప్పు ఇప్పించిన వ్యక్తికి ఆ సొమ్ము తీసుకున్న వ్యక్తి సరైన సంజాయిషీ చెప్పకపోవడంతో మనస్తాపానికి గురైన ఒక వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ తిల్లమ్మ చెరువుకాలనీకి చెందిన మెల్లం సాయిబాబు(33) రాణేలంకకు చెందిన అతడి స్నేహితుడికి రూ.15 లక్షలు అప్పుగా ఇప్పించాడు. ఆ అప్పుకు సంబంధించి సాయిబాబు ష్యూరిటీగా ఉన్నాడు. తీసుకున్న అప్పు చెల్లించాలని సాయిబాబు అతని స్నేహితుడిని పదేపదే అడిగినా తనకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పదిరోజులుగా తీవ్ర మనస్తాపానికి గురై 14వ తేదీ రాత్రి అప్పు తీసుకున్న వ్యక్తి ఇంటివద్ద కలుపు మందు తాగి ఆత్మహత్యాయతానికి పాల్పడ్డాడు. దీంతో అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీమేశ్వరాలయంలో సంప్రదాయబద్ధంగా జ్వాలాతోరణం



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు



సామర్లకోట భీమేశ్వరాలయంలో జ్వాలాతోరణం పూజలు చేస్తున్న భక్తులు

ద్రాక్షారామ, నవంబరు16(ఆంధ్రజ్యోతి):ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో శనివారం జ్వాలాతోరణం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కృత్తిక నక్షత్రం రోజున స్వామివారి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తారు. సాయంత్రం 8 గంటలకు స్వామివారికి సర్వదేవాతా ఆహ్వానం, దూపసేవ నిర్వహించారు. అనంతరం ప్రదోషకాల పూజ జరిపారు. నేతి జ్యోతికాంతిలో ఉత్సవమూర్తులతో ఆలయ ప్రదక్షిణం చేశారు. సప్తగోదావరి తీరంలో జ్వాలాతోరణం నిర్వహించారు. మంత్రి సుభాష్ సతీసమేతంగా స్వామివారిని దర్శించుకుని జ్వాలాతోరణం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌జేసీ సుబ్బారావు, ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చకులు, వేదపండితులు, స్వస్తివాచకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోట: శనివారంరాత్రి కుమారరామ భీమేశ్వరాలయం ఎదుట జ్వాలాతోరణ పూజలు వందలాది భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, రాజశేఖరశర్మ, వెంకన్న తదితరులచే ముందుగా వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి,అమ్మవార్ల దేవతామూర్తులను ప్రత్యేక సర్వవాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించి రాత్రికి ఆలయానికి తోడ్కొని రాగా అప్పటికే వేచి ఉన్న భక్తులు శివనామ స్మరణల మధ్య పండితులు జ్వాలాతోరణాన్ని జ్వలింపజేశారు. ఈ పూజలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ

మలికిపురం,నవంబరు16(ఆంధ్రజ్యోతి): గూడపల్లి పల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో భోజన మండపానికి అవసరమైన 16ఫ్యాన్లను పాఠశాల యాజమాన్య కమిటీ సమకూర్చింది. పిల్లలకు భోజనం చేయడానికి ప్లేట్లను సమకూర్చారు. సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి, ఎంపీటీసీ కొల్లు నరసింహారావు పాల్గొన్నారు.

జనసేన నేత పండు మృతికి సంతాపం

అల్లవరం,నవంబరు16(ఆంధ్రజ్యోతి): జనసేన చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి బట్టు పుల్లేశ్వరరావు(పండు) మృతిపట్ల మండలం జనసేన నాయకులు సంతాపం వ్యక్తంచేశారు. జన సేన నాయకులు కంకిపాటి వీరబాబు, పిల్లా ప్రసాద్, పిండి గణపయ్య, నల్లా రాము, గుర్రం కృష్ణ, రొక్కాల నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు.

గ్రంథాలయ ఉద్యమానికి బాటలువేసిన మహనీయులు

రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్యలకు నివాళి

అమలాపురం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం నవరప్పాలెం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమానికి బాటలు వేసిన మహనీయులకు నివాళులర్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయ నిర్వాహకుడు ఎన్వీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సమనస శ్రీరామా పబ్లిక్ స్కూలులో గ్రంథాలయ ఉద్యమానికి బాటలు వేసిన డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు ప్రిన్సిపాల్ పురాణపండ లక్ష్మీగణేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమలాపురం ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జీవీ ఆర్ఎస్‌హెచ్‌కే వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలిశెట్టి సత్యనారాయణమూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అంతర్వేది గ్రంథాలయంలో మూడో రోజు శనివారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 53మంది విద్యార్థులు పాల్గొనగా విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించినట్టు గ్రంథాలయ వైద్యాధికారి వై.వెంకటలక్ష్మి తెలిపారు. కార్యక్రమాన్ని తెలుగు ఉపాధ్యాయుడు చింతా శ్యామ్‌బాబు పర్యవేక్షించారు.



అమలాపురం: గ్రంథాలయ ఉద్యమ ఆద్యుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న లక్ష్మీగణేష్ తదితరులు

ఉద్యమకారుల సంస్మరణ సభ

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఐ.పోలవరంలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ జరిగింది. గ్రంథాలయ అధికారి అంబటి వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరామయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమంలో సేవలందించిన ప్రముఖులు ఎస్.ఆర్. రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావుకు పుస్తక ప్రియులు, గ్రంథాలయ పాఠకులు నివాళి అర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం ఉప్పలగుప్తం, భీమనపల్లి గ్రంథాలయాల్లో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది అద్దంకి అమరేశ్వరరావు, గ్రంథాలయాధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషకుమార్, సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం శాఖ గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమ వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. లైబ్రేరియన్ శీలం నాగరాజు ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శాఖ గ్రంథాలయంలో శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారిణి ఎస్.జయషీల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్యల గురించి స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వివరించారు. గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖాగ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయాధికారి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణయ్య, రంగనాథన్, నాగభూషణం, హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందించండి

బీసీ హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే దేవ

రాజోలు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజోలు బీసీ బాలుర హాస్టల్‌ను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం సందర్శించారు. ఈనెలలో బీసీ హాస్టల్‌లో ఆకలి కేకలపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన శీర్షికపై కలెక్టర్ స్పందించి వార్డెన్‌ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి ఎమ్మెల్యే భోజన వసతి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థి వద్దకు వెళ్లి వారి భుజం మీద చేయివేసి తాగునీటి వసతి, ఆహార పదార్థాలు రుచికరంగా ఉంటున్నాయా అంటూ ఆరా తీశారు. మూడో తరగతి చదువుతున్న విద్యార్థి ఓలేటి వీరబాబు వద్ద నుంచి సస్పెండ్ అయిన వార్డెన్ రూ.1800 తీసుకున్నారని, మిగతా విద్యార్థుల వద్ద నుంచి కూడా డబ్బులు తీసుకున్నాడని విద్యార్థులంతా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి టీవీ ప్రసాద్‌ను ఏ విద్యార్థుల వద్ద వార్డెన్ ఎంత డబ్బులు తీసుకున్నాడో ఆ డబ్బులు తిరిగి విద్యార్థులకు అందజేయాల్సిందిగా సూచించారు. గత తొమ్మిది నెలలుగా మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా అధికారి ప్రసాద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. హాస్టల్ విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. వంట గదిలోకి వెళ్లి భోజనం, కూరలను స్వయంగా ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎ వేమా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు మండలం టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, రాజోలు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, ఉప సర్పంచ్ పామర్తి రమణ, గాలిదేవర వెంకన్నబాబు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, మానుకొండ దుర్గాప్రసాద్, ఎం.లక్ష్మి, చెల్లింగి జాంబవతి, గుండాబత్తుల తాతాజీ పాల్గొన్నారు.



రాజోలు బీసీ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సోమనాథేశ్వర వజ్రలింగానికి భక్తుల పూజలు



మామిడికుదురులో సోమనాథేశ్వర వజ్రలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

మామిడికుదురు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దివ్య స్వర్ణిమ రథయాత్రలో వచ్చిన సోమనాథేశ్వర వజ్రలింగానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వర్ణిమ రథయాత్ర శనివారం మామిడికుదురు చేరుకుంది. మామిడికుదురులోని కేతన్ యోగా సెంటర్ వద్ద, స్థానిక శివాలయం వద్ద భక్తులు వజ్రలింగాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. 2018లో హిందూపురం నుంచి ప్రారంభమైన రథయాత్ర నాలుగు రాష్ట్రాల మీదుగా ఆరు వేల గ్రామాల్లో పర్యటించామని, వెయ్యి స్కూళ్లు, కళాశాలల్లో నైతిక విలువల గురించి తెలియచేసినట్టు రాజయోగా టీచర్ బీకే చంద్రశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడు ఒక్కడేనని నేటి సమాజంలో నైతిక విలువలు కోల్పోయి, దుఃఖం, అశాంతులు పెరిగిపోతున్నాయని, విశ్వ శాంతి, విశ్వ కల్యాణం, విశ్వపరివర్తనల కోసమే కోసమే రథయాత్ర చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి మణి, కార్తీక్, ఆకుల కేతన్, స్థానికులు మెండా ఆదినారాయణలు, మల్లాడి అభి, మెండా వెంకటేశ్వరరావు, కోట బ్రహ్మానందం, బత్తుల శ్రీనివాస్, పాల్గొన్నారు.

టీడీపీలో కష్టించి పనిచేసిన వారందరికి గుర్తింపు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నామన రాంబాబు



పెదబాబును అభినందిస్తున్న రాంబాబు, నాథ్‌బాబు తదితరులు

అంబాజీపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కష్టించి పనిచేసిన వారికి టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు సముచిత స్థానం కల్పిస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నామన రాంబాబు అన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన అంబాజీపేటకు చెందిన టీడీపీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొంతు గంగాధర్(పెదబాబు)ను శనివారం రాంబాబుతో పాటు టీడీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీమాజీ బోర్డు సభ్యుడు డొక్కానాథ్‌బాబు, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మికోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు, నంసాని పెద్దిరాజు, చిన్నం బాలవిజయరావు, సర్పంచ్ జల్లి బాలరాజు, దొమ్మేటి రామారావు, గుత్తుల పండు, ఈతకోట సత్యనారాయణ, శేరు శ్రీను, దొమ్మేటి శ్యామ్ పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి



అమలాపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం అమలాపురం గండువీధిలోని శేషశయన మందిరంలో శిరంగు నాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అడ్డాల గోపాలకృష్ణతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నదీకోత నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి

అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే గిడ్డి



పి.గన్నవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు పూర్తిగా నదీ పరివాహక ప్రాంతాలని, వరదల సమయంలో ఈప్రాంత రైతులు విలువైన భూములు కోల్పోతున్నారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. కోతకు గురైన భూములకు బాధిత రైతులకు ఏవిధమైన నష్టపరిహారం అందడంలేదన్నారు. ప్రభుత్వం నదీ కోత నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పి.గన్నవరం మండలంలోని గంటిపెదపూడి, ఉడిమూడి గ్రామాల పరిధిలోని నాలుగు లంక గ్రామాల రాకపోకలు కోసం నదీ పాయపై రూ.49.50కోట్లతో వంతెన నిర్మాణం జరుగుతుందన్నారు. అయితే ఇప్పటి వరకు ఏవిధమైన బిల్లులు మంజూరు కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు మంజూరు చేస్తే, వంతెన నిర్మాణం పూర్తవుతుందని, తద్వారా లంకగ్రామాల ప్రజలకు వరదల సమయంలో ఇబ్బందులు తప్పుతాయని వివరించారు. వరదలకు అయినవిల్లి మండలం ఎదురుబీడిం, మామిడికుదురు మండలం అప్పనపల్లి గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రెండు చోట్ల కాజ్‌వేలు నిర్మాణం చేస్తే ఆ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఎమ్మెల్యే వివరించారు.

జాతీయ సదస్సులో పాల్గొన్న నాయకులు



కలకత్తాలోని జాతీయ సదస్సుకు హాజరైన మండలానికి చెందిన నాయకులు

మామిడికుదురు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కలకత్తాలో జరిగిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ స్కేల్ ఫిష్ వర్కర్స్ జాతీయ సదస్సులో మామిడికుదురు మండలంలోని పాశర్లపూడికి చెందిన మత్స్యకార నాయకులు పాల్గొన్నారు. ఈసదస్సు ఈనెల15,16 తేదీల్లో జరగ్గా ఆంధ్రప్రదేశ్ నుంచి డి.పాల్, డి.ఆదినారాయణ, చింతా శ్రీనివాస్, వి.కొండబాబు, మల్లాడి వీరపండు పాల్గొన్నారు. సమావేశంలో సీఆర్‌జెడ్, ఆక్వాకల్చర్, రైల్వే వంతెన నిర్మాణానికి సంబంధించి, పలు విషయాలపై చర్చించినట్టు వారు తెలిపారు.

అభినందనలు

మామిడికుదురు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎంపికైన కుడుపూడి సత్తిబాబును మామిడికుదురు మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. సత్తిబాబును దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో అప్పారి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి భాస్కరరావు, సాపే ఏకాదశి, దొమ్మేటి గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

వంద రోజుల కార్యాచరణతో ఉత్తమ ఫలితాలు

ఉప్పలగుప్తం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులందరూ వంద రోజుల కార్యాచరణలో భాగస్వాములు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్కే సలీంబాషా విజ్ఞప్తి చేశారు. టెన్త్ విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తే టెన్త్ ఫలితాలు ఉత్తమ స్థాయిలో ఉంటాయన్నారు. శనివారం ఆయన గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయన రికార్డులతో సహా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని తరగతులను సందర్శించి పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నించారు. పాఠశాలలోని 164మంది టెన్త్ విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధమవుతున్నారనే అంశంపై ఆయన విద్యార్థులను ఆరా తీశారు. వంద రోజుల కార్యాచరణపై మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఎం లంక రాణి, సీఎస్‌వో బొరుసు సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ పాల్గొన్నారు.



టెన్త్ వంద రోజుల కార్యాచరణపై ఉపాధ్యాయురాలిని ఆరా తీస్తున్న డీఈవో

స్టోర్స్ సమస్యలు పరిష్కరించండి



ఢిల్లీ ప్రతినిధి మల్లాడితో చర్చిస్తున్న ఆర్‌సీఎస్ యశ్వంతయ్య, ఇతర అధికారులు

యానాం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యానాం సహకార శాఖ ఆధీనంలో ఉన్న కోఆపరేటివ్ స్టోర్స్ సమస్యలు పరిష్కరించాలని రిజిస్టర్ ఆఫ్‌కోపరేటివ్ సొసైటీస్ (ఆర్‌సీఎస్) యశ్వంతయ్యను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. యశ్వంతయ్య మల్లాడిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం స్టోర్స్ సిబ్బందికి సంబంధించిన సమస్యలను మల్లాడి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ అంశాలపై మంగళవారం ముఖ్యమంత్రిసమక్షంలో చర్చించానని, యానాం నుంచి స్టోర్స్ నూతన పాలకవర్గం రానుందని మల్లాడి చెప్పారు. ఆర్‌సీఎస్‌ను మల్లాడి సత్కరించారు. పుదుచ్చేరి నుంచి వచ్చిన అధికారులతో పాటు యానాం స్టోర్స్ అధ్యక్షుడు లంక విద్యాసాగర్, స్టోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కమిటీ ఏర్పాటు

స్వచ్ఛత, పారిశుధ్యం అంశాలపై అవగాహన



సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి

అమలాపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ అమలు కోసం జిల్లా గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈకమిటీ ఆధ్వర్యంలోనే మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహిస్తామని, డిసెంబరు 10న ప్రపంచ మానవహక్కుల దినోత్సవం వరకు స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత, పారిశుధ్యం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా కమిటీకి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షులుగా ఉంటారన్నారు. కార్యదర్శిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, సభ్యులుగా జిల్లాపరిషత్ సీఈవో, డీపీవో, డీఆర్డీఏ పీడీలు ఉంటారు. జిల్లా నోడల్ సభ్యులుగా డీఎంఅండ్‌హెచ్‌వో, ఐసీడీఎస్ పీడీ, డీఈవో, జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్, భూగర్భ జలశాఖ ఎస్ఈ, జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎస్ఈ కృష్ణారెడ్డి కోరారు.

ఆర్టీసీలో సమయపాలన మాసోత్సవాలు



ఆర్టీసీ డిపోలో సమయపాలన మాసోత్సవాల్లో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు

అమలాపురంటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు సంతృప్తికరమైన సేవలు అందించేందుకు బస్సులు సమయపాలన పాటించడం ద్వారా సంస్థ ఆదాయం పెరుగుతుందని జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. పోటీ ప్రపంచంలో ప్రజలు మెరుగైన సౌకర్యాలను కోరుకుంటున్న తరుణంలో సమయ పాలన ముఖ్య పాత్ర పోషిస్తుందని, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు గుర్తించాలన్నారు. అమలాపురం ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో ఈనెల16 నుంచి డిసెంబరు 15వరకు సమయ పాలన మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అమలాపురం డిపో వద్ద శనివారం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో శ్రీనివాసరావు మాట్లాడారు. డ్రైవర్లు, కండక్టర్లు విధులకు సకాలంలో హాజరై సమయానికి బస్సులు బయలుదేరడం, గమ్య స్థానాలకు చేర్చడం చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ హితం కోరుతూ లక్ష్మీగణపతి హోమం

అమలాపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అమలాపురం దుడ్డు వారి అగ్రహారంలోని బాలవిద్యార్థి గణపతి ఆలయం వద్ద శనివారం పర్యావరణ హితాన్ని కోరుతూ బాలవిద్యార్థి గణపతి సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ పంచాంగకర్త ఉపద్రష్ట నాగాదిత్యన్ సోదరుల ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు హోమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విశ్వమానవ శ్రేయస్సు, పర్యావరణ హితాన్ని కోరుతూ హోమం నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు.

మత్స్యకారులకు ఆటల పోటీలు

యానాం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యానాంలో ప్రపంచ మత్స్యకార దినత్సోవం సందర్భంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మత్స్యకారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈపోటీలను యానాం మత్స్య శాఖ ఏడీ దడాల గోంతయ్య, ఇతర అధికారులు పర్యవేక్షించారు. విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తారు.

ద్విచక్ర వాహనంపై శబరిమలై యాత్ర

పి.గన్నవరం, నవంబరు16(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం శివారు బొడపాటి వారిపాలెం నుంచి ఇద్దరు స్వాములు ద్విచక్ర వాహనంపై శబరిమలై యాత్రకు బయలుదేరారు. గ్రామానికి చెందిన చవ్వాకుల కాశీకృష్ణ స్వామి మాట్లాడుతూ ఇప్పటివరకు 9సార్లు మాలధారణ చేశానని, ద్విచక్ర వాహనంపై శబరిమలై వెళ్లడం ఇది మూడోసారి అని తెలిపారు. శబరిమలై వెళ్లడానికి మూడు రోజులు పడుతుందన్నారు. ప్రయాణంలో దేవాలయాలను సందర్శించుకుని పది రోజుల్లో యాత్ర పూర్తి చేసుకుని వస్తామన్నారు.

సాయివీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

మామిడికుదురు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లిలో వేంచేసి ఉన్న సాయివీరభద్రస్వామి ఆలయంలో 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తులా గోపాలకృష్ణ, నాగసూర్యావతి, యేడిద వెంకటనారాయణ, విజయకనకదుర్గ దంపతులు కర్తలుగా పాల్గొని గణపతి పూజ, పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర బిల్వార్చన తదితర పూజలు ఘనంగా చేశారు. వార్షికోత్సవంలో భాగంగా జరిగిన పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

ముమ్మిడివరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలోని శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. కార్తీకమాసం మూడో శనివారం కావడంతో కోనసీమ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు కొండవీటి రాంబాబు, ఆదిత్యశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. వేంకటేశ్వరస్వామికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, నగరపంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు.

మినీ అంగన్‌వాడీలను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా

అమలాపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని డిమాండు చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. జిల్లాశాఖ అధ్యక్షురాలు బి.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మినీ వర్కర్లగా పదమూడేళ్లుగా పనిచేస్తూ తీవ్రమైన పని భారాన్ని ఎదుర్కొంటున్నారని, కనీస వేతనం కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు రత్నకుమారి, మహేశ్వరి, వెంకటలక్ష్మి, సూర్యకళ, సుశీల, పార్వతి, దుర్గ, కల్యాణి, ఈశ్వరి, సుబ్బలక్ష్మిపాల్గొన్నారు.

జాతీయ పోటీలకు రామాలయంపేట యువకుడు



ఐ.పోలవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అండర్-19 జాతీయ వాలీబాల్ పోటీలకు ఎదుర్లంక రామాలయంపేటకు చెందిన నీరుపూడి ప్రసాద్ ఎంపికయ్యాడు. మాలమహానాడు ఆధ్వర్యంలో శనివారం ప్రసాద్‌ను సన్మానించారు. ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో దుక్కిపాటి సత్యనారాయణ, బడుగు జేమ్స్‌పాల్, కాశి హనుమంతరావు, కాశి జగపతి, జనిపెల్ల సోమన్న, వడ్డి శ్యాంప్రసాద్, వజ్రపు శరత్, మెండి కృష్ణబాబు, దేవరపల్లి ఏడుకొండలు, కాశి లాజర్, కాశి సాయి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

మలికిపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కువైట్‌కు చెందిన ఆదర్శ ఆంధ్ర యూత్ సంఘం ఇరువురికి ఆర్థిక సహాయం అందించింది. విశ్వేశ్వరాయపురంలో గృహం నిర్మించుకునేందుకు ఎస్.రాజామణికి రూ.10వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఎస్.మరియమ్మకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు మోకా స్వామి, ఇంజేటి శ్యామ్‌బాబు, గెడ్డం రామారావు, బత్తుల రాము, గెడ్డం తులసీభాస్కర్ పాల్గొన్నారు.


హిందూ ధర్మాన్ని పెంపొందించేందుకు పాదయాత్ర



మామిడికుదురులో పాదయాత్ర చేస్తున్న వల్లూరుకు చెందిన భక్తులు

మామిడికుదురు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మం పెంపొందలంటూ పశ్చిమగోదావరి జిల్లా వల్లూరు, భీమ్లాపురం గ్రామాలకు చెందిన హిందూ సమాజ జనులు అప్పనపల్లి వరకు పాదయాత్రను శనివారం నిర్వహించారు. వల్లూరు నుంచి చించినాడ బ్రిడ్జి మీదుగా శివకోటి, రాజోలు, పొదలాడ, జగ్గన్నపేట, నగరం, మామిడికుదురు, పాశర్లపూడి మీదుగా 42కిలోమీటర్లు పాదయాత్ర చేసి అప్పనపల్లి చేరుకున్నారు. మామిడికుదురులో ఆభంజనేయస్వామి ఆలయం వద్ద హిందూ గీతాలను ఆలపిస్తు కోలాట భజన నిర్వహించారు. 600మంది భక్తులు చిన్నారులు, మహిళలు పాదయాత్రలో పాల్గొన్నారు. దారిపొడవునా పాదయాత్ర చేస్తున్న భక్తులకు ఆహార పానియాలు అందించారు.

క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సయ్యపరాజు



అయినవిల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు, పోతుకుర్రు గ్రామానికి చెందిన సయ్యపరాజు సత్యనారాయణరాజు (సత్తిబాబురాజు) నియమితులయ్యారు. ఈసందర్భంగా శనివారం సత్యనారాయణరాజుకు నేదునూరి ఎంపీటీసీ కళ్లేపల్లి సుబ్బరాజు, మాజీ ఎంపీపీ సలాది పుల్లయ్యనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, సర్పంచ్‌లు బొబ్బా ప్రభాత్‌కుమార్, కాకర శ్రీను తదితరులు అభినందనలు తెలిపారు.

104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి

అంబాజీపేట, నవంబరు16(ఆంధ్రజోతి): 104సేవలను పీహెచ్‌సీల ద్వారా నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని 104 వైద్యసేవల జిల్లా ప్రధాన కార్యదర్శి పితాని త్రిమూర్తులు కోరారు.మాచవరం పంచాయతీ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి వెంకటసుబ్బారావులకు వినతిపత్రం అందించారు. జీవోనెం.7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మూడేళ్ల నుంచి చెల్లించని ఇంక్రిమెంట్లు ఏరియర్స్ రూపంలో ఇప్పించాలన్నారు.

బూత్ కమిటీలతో బీజేపీని బలోపేతం చేయాలి

అమలాపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా పట్టణంలో బూత్ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు పేర్కొన్నారు. యర్రమిల్లివారి వీధిలోని కార్యాలయం వద్ద పట్టణశాఖ ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. పట్టణంలోని 43బూత్‌లలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు బండి శ్రీనివాస్, అరిగెల తేజవెంకటేష్, చిలకమర్రి కస్తూరి, కొండేటి ఈశ్వర్‌గౌడ్, జగతా శాంతి, మోకా ఆదిలక్ష్మి, పావులూరి వెంకటేష్ పాల్గొన్నారు.

గోదావరిలోకి జారి పడి వ్యక్తి మృతి

ముమ్మిడివరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గోదావరిలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ నీటమునిగి మృతిచెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడికి చెందిన మాదాల వెంకటేశ్వరరావు(57) గురువారం మురమళ్ల గోదావరి నదీ స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతిచెందాడు. మృతదేహం శనివారం అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిలంక సమీపంలో గోదావరిలో లభ్యమైంది. అతడికి భార్య కన్యకాపరమేశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

మోటారుసైకిల్ చోరీ

ముమ్మిడివరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరానికి చెందిన టీడీపీ నాయకుడు విళ్ల వీరాస్వామినాయుడు మోటారు సైకిల్‌ను రోడ్డు పక్కన పెట్టి అన క్యాంటీనులోకి వెళ్లి తిరిగి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఇటీవల కాలంలో ముమ్మిడివరంలో తరచూ మోటారు సైకిళ్లకు గురవ్వడంతో తరచూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చి కుక్క దాడిలో ఆరేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలు

పి.గన్నవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరం ప్రధాన రహదారి చెంతన ఆరేళ్ల చిన్నారి బి.హిక్షితపై పిచ్చి కుక్క దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని పి.గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అత్యవసర చికిత్స అనంతరం చిన్నపిల్లల వైద్యుడి వద్దకు తీసుకువెళ్లాలని సూచించారు. అలాగే లంకలగన్నవరంలోని పాల వ్యాపారి పర్రశెట్టి వెంకట్రావు, మరో మహిళపై కుక్క దాడి చేసింది.

శతాధిక వృద్ధురాలి మృతి



ఉప్పలగుప్తం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చల్లపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు దంగేటి కొండమ్మ(106) శనివారం మృతి చెందారు. ఆమె ఇప్పటి వరకు ఎంతో ఆరోగ్యంగా ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కొండమ్మకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కాగా మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలతో సహా 25మంది వరకు ఉన్నారు. ఆమె మృతి పట్ల సర్పంచ్ ఇసుకపట్ల జయమణిరఘుబాబు, గ్రామ పెద్దలు విచారం వ్యక్తం చేశారు.

బెల్టుషాపు నిర్వాహకులు బైండోవర్

అమలాపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తున్న పులిదిండి ఏడుకొండలు, డేగల అంజిబాబును అమలాపురం తహశీల్దార్ కోర్టులో బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ ఎస్ఐ పి.బాలాజీ సిబ్బందితో శనివారం దాడిచేసి వీరిని అదుపులోకి తీసుకుని కోర్టులో బైండోవర్ చేసినట్టు తెలిపారు.

రామేశ్వరం తీరంలో వలస మత్స్యకారులపై దాడి

అల్లవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్.రామేశ్వరం తీరంలో కొయ్యింగ చేపల పిల్లల వేట విషయమై పశ్చిమబెంగాల్‌కు చెందిన వలస మత్స్యకారులు, స్థానిక మత్స్యకారుల మధ్య వివాదాలు తలెత్తాయి. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన వలస మత్స్యకారుల తాత్కాలిక గుడిసెను, చేపల పిల్లల గుంటకు గండికొట్టి ఘర్షణకు దిగడంతో ఘర్షణ చెలరేగింది. అంగాడి కాలిస్వామి, చెక్కా శ్రీను, చెక్కా కృష్ణమూర్తితో పాటు 15 మంది తీరంలో తమపై దాడికి పాల్పడ్డారని తమకు చెందిన ఐదు సెల్‌ఫోన్లు, రూ.50వేల నగదు పవర్‌బ్యాంకు లాగేసుకున్నారని వలస మత్స్యకారులు అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసంఘటనలో ఉభయ వర్గాలకు చెందిన వారికి స్వల్పగాయాలయ్యాయి. దీనిపై అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ

మలికిపురం,నవంబరు16(ఆంధ్రజ్యోతి): గూడపల్లి పల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో భోజన మండపానికి అవసరమైన 16ఫ్యాన్లను పాఠశాల యాజమాన్య కమిటీ సమకూర్చింది. పిల్లలకు భోజనం చేయడానికి ప్లేట్లను సమకూర్చారు. సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి, ఎంపీటీసీ కొల్లు నరసింహారావు పాల్గొన్నారు.

జనసేన నేత పండు మృతికి సంతాపం

అల్లవరం,నవంబరు16(ఆంధ్రజ్యోతి): జనసేన చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి బట్టు పుల్లేశ్వరరావు(పండు) మృతిపట్ల మండలం జనసేన నాయకులు సంతాపం వ్యక్తంచేశారు. జన సేన నాయకులు కంకిపాటి వీరబాబు, పిల్లా ప్రసాద్, పిండి గణపయ్య, నల్లా రాము, గుర్రం కృష్ణ, రొక్కాల నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు.

'మండపేట'ను రాజమహేంద్రవరంలో కలపాలి

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే వేగుళ్ల



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాల విభజన సమయంలో మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరంలో కలపాలన్న డిమాండ్ వున్నప్పటికి ప్రజల అకాంక్షను పక్కన పెట్టి కోనసీమ జిల్లాలో కలిపారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో నియోజకవర్గాన్ని కోనసీమ జిల్లా నుంచి విడదీసి రాజమహేంద్రవరంలో కలపాలని శనివారం ఆయన అసెంబ్లీ సమావేశాల జీరో అవర్‌లో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లారు. అప్పట్లో అఖిలపక్షం అధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కాంగ్రెస్, వామపక్ష పార్టీలు కోనసీమ జిల్లాలో మండపేటను కలపడాన్ని వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అప్పటి వైసీసీ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆయన అస్తులు కోనసీమలో ఉండటంతో వ్యక్తిగత స్వార్థం కోసం నియోజక వర్గాన్ని కోనసీమలో విలీనం చేశా రన్నారు. నియోజకవర్గ ప్రజల అకాంక్ష మేరకు మండపేట నియో జకవర్గాన్ని రాజమహేంద్రవరంలో కలపాలని విజ్ఞప్తి చేశారు.

టిడ్కో గృహాలపై ప్రస్తావన: నియోజకవర్గంలో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాల సముదాయంలో ఫేజ్1లో 4,064 గృహాలు, ఫేజ్2లో 2,064ఇళ్లను నిర్మించారన్నారు. 2019లో టీడీపీ ప్రభు త్వం ఎస్‌టీపీ మినహా యించి మౌలిక వసతులు కల్పించిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నేటికీ పనులు పూర్తి కాలేదన్నారు. లబ్ధిదారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి త్వరితగతిన ఇళ్లను ఇవ్వాలని కోరారు. మండపేటలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయానికి మున్సిపల్ మంత్రి నారాయణ త్వరలో వస్తానని హామీ ఇచ్చారన్నారు.

తక్షణమే విలీనం చేయాలి: రాజమహేంద్రవరంలో మండపేట నియోజకవర్గాన్ని కలపాలంటూ ఎమ్మెల్యే ప్రస్తావించడంపై అఖిలపక్ష నాయకులు కామన ప్రభాకరరావు, దూళి జయరాజు, కోన సత్యనారాయణ, కె.కృష్ణవేణి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అకాంక్ష మేరకు సత్వరమే రాజమహేంద్రవరం లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మండపేట సమస్యను ప్రస్తావించిన ఆయన్ను అఖిలపక్ష నాయకులు అభినందించారు.

రామ్మూర్తి నాయుడు మృతికి సంతాపం: టీడీపీ సీనియర్‌నేత మాజీ ఎమ్మెల్యే నారా రామూర్తినాయుడు మృతికి సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ ఎమ్మెల్సీ వీవీవీఎస్ఎస్ చౌదరితో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి సంతాపం తెలిపారు.

చైర్‌పర్సన్‌కు ప్రధాని మోదీ చిత్రపటం అందజేత

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవికి శనివారం బీజేపి నాయకులు ప్రధాని మోదీ చిత్రపటం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో మోదీ చిత్రపటం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్ నాయుడు, కులపాకుల వెంకట రమణ, పులిగడ్డ సురేష్ పాల్గొన్నారు.

శబరిమలై యాత్రకు ఆర్టీసీ బస్సు

రావులపాలెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శబరిమలై యాత్రకు రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి స్వాములతో బయలుదేరిన బస్సును డీఎం కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా పంచారామాలకు ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఆ బస్సులు ఈనెల17వ తేదీ, 24వ తేదీ ఆదివారం రాత్రి 8గంటలకు బయలుదేరి సోమవారం అమరావతి భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట దర్శనాల అనంతరం కాంప్లెక్స్‌కు చేరుతుందన్నారు.

మహిళా సంరక్షణపై అవగాహన

కపిలేశ్వరపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): టేకి ఉన్నత పాఠశాలలో శనివారం అంగర ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో మహిళా సంరక్షణపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైం, పోక్సోయాక్ట్‌పై ఎస్ఐ అవగాహన కల్పించారు. హెచ్ఎం, ఉపాధ్యాయసిబ్బంది, టేకి, అంగర, పడమరఖండ్రిక, మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

స్థానిక అవసరాలకు మాత్రమే ఇసుక

కొత్తపేట ఆర్డీవో శ్రీకర్



మందపల్లి ఇసుక ర్యాంపును పరిశీలించి జట్టు కూలీలకు సూచనలు చేస్తున్న ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మందపల్లి (ఆలమూరు-2)గా ఉన్న ఇసుక రీచ్‌లో స్థానిక అవసరాలకు మాత్రమే ఇసుకను పంపిణీ చేస్తామని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. శనివారం మందపల్లి ఇసుక రీచ్‌ను హెడ్‌వర్క్స్, రెవిన్యూ పోలీస్ అధికారులతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. సచివాలయ సాండ్ పోర్టల్‌లో నమోదై, రశీదు పొందిన వారికి మాత్రమే ఇసుకను ఇస్తామన్నారు. ఈసందర్భంగా జట్టు కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. సచివాలయ సాండ్‌పోర్టల్‌లో జనరల్ కన్స్యూమర్‌కు ఇసుక ఇవ్వడం జరగదని, లోకల్ కన్స్యూమర్ ఆప్షన్ ద్వారా మాత్రమే ఇసుకను పంపిణీ చేయాలని డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మిగిలిన ప్రాంతాల వారికి మందపల్లి ఇసుక రీచ్ నుంచి ఇసుకను ఇవ్వడం జరగదని, కేవలం స్థానికుల అవసరాలకు మాత్రమే ఇసుకను ఇస్తామన్నారు. ఇది గమనించి ఇసుక కావాల్సిన వారు సంబంధిత సచివాలయంలో సాండ్‌పోర్టల్‌లో నమోదు చేసుకుని రశీదు పొందిన తరువాత మాత్రమే ర్యాంపునకు రావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు వై.రాంబాబు, ఆర్ఐ రవిశంకర్, హెడ్ వర్క్స్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీవో విచారణ



విచారణ చేస్తున్న ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో

కపిలేశ్వరపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అంగర పంచాయతీ కార్యాలయంలో నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ అందిన ఫిర్యాదుపై ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో ఐదం రాజు శనివారం విచారణ చేపట్టారు. 2021-24 వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.80లక్షలు, పంచాయతీ ఆదాయం రూ.కోటి సక్రమంగా వినియోగించకుండా అవకతవకలకు పాల్పడ్డారంటూ గ్రామ ఉపసర్పంచ్ యర్రా వీరన్నబాబు కలెక్టర్ కార్యాలయం, పంచాయతీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసారు. రూ.40లక్షలు గడప గడపకు మన ప్రభుత్వ నిధులు కూడా సర్పంచ్, కార్యదర్శులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో ప్రాథమిక విచారణ చేసి పిటిషన్‌దారు నుంచి వివరాలు సేకరించి నమోదు చేశారు. త్వరలో కమిటీ వేసి దర్యాప్తు చేస్తామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు. గ్రామకార్యదర్శి ఆర్. మోహన్, గ్రామసర్పంచ్ వాసా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆస్తుల పరిరక్షణలో బాధ్యతగా పనిచేయాలి



అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా దేవదాయశాఖ అధికారి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, ధర్మాదాయ సంస్థల పరిరక్షణలో అధికారులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖాధికారి వి.సత్యనారాయణ అన్నారు. శనివారం రామచంద్రపురం పట్టణంలో దేవదాయ శాఖ తనిఖీదారు కార్యాలయంలో కొత్తపేట, రామచంద్రపురం డివిజన్‌లో దేవాలయాల కార్యనిర్వహణాధికారులు, మండల ఎండోమెంట్ అధికారులతో సమీక్ష జరిపారు. ఆలయాల భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు లేని భూములకు దరఖాస్తులు చేయడం, ఆక్రమణలో ఉన్న భూములపై చర్యలు, కామన్‌గుడ్ ఫండ్, ఎండోమెంట్ అడ్మినిస్ట్రేషన్ ఫండ్, అర్చక సంక్షేమనిధికి జమలపై సమీక్ష నిర్వహించారు. దేవదాయ శాఖ తనిఖీదారులు బాలాజీ రామ్‌ప్రసాద్, ప్రసాద్, రామచంద్రపురం, కొత్త పేట డివిజన్‌లో కార్యనిర్వహణాధికారులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులతో సమానంగా సహకార సేవలు

డివిజనల్ కోఆపరేటివ్ అధికారి రాధాకృష్ణ

ఆలమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య బ్యాంకులలో అందించే సేవలను సహకార సంఘాలలో అందించేలా చర్యలు చేపడుతున్నట్లు డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఎ.రాధాకృష్ణ అన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా ఆలమూరు పీఏసీఎస్ వద్ద సహకార పతాకాన్ని ఆవిష్కరించారు అనంతరం జరిగిన సహకార ఉద్యోగుల సమావేశంలో రాధాకృష్ణ మాట్లాడారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అందించే రుణాల్లో కేవలం డాక్యుమెంట్ల ఆధారంగా కాకుండా ఆస్తులను నేరుగా పరిశీలించి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో సహకార వారోత్సవాల ఇన్‌చార్జ్ ఆదిమూలం వెంకటేశ్వరరావు, ఆలమూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ డి.రాంబాబు, ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, సహకార ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన సత్యవతి



మండపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గడి సత్యవతి శనివారం ఎమ్మెల్యే వేగుళ్లజోగేశ్వరరావును స్థానిక పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్లను గడి సత్యవతి దంపతులు సత్కరించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌క ల్యాణ్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్తమూరులో వైద్య శిబిరం



మండపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అర్తమూరుకు చెందిన ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయ మని ఏపీ గిడ్డంగులు సంస్థ మాజీ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి అన్నారు. గ్రామంలో ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 177వ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియో కళాశాల వైద్యులు సేవలందించారు. ట్రస్టీ సత్తి బుల్లిస్వా మిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో ట్రస్టు సేవలు మరింత విస్తరిస్తామన్నారు. వైద్యులు విమల, వెంకటేష్, తేజశ్రీ పాల్గొన్నారు.

సోమేశ్వరుడికి సువర్ణ నేత్రాలు అందజేత



సోమేశ్వరస్వామికి బంగారు నేత్రాలు సమర్పిస్తున్న దృశ్యం

రాయవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సోమేశ్వరం శ్రీబాలా త్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామికి దాత సువర్ణ నేత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి సత్తిబాబు, నాగసునీత దంపతులు వారి కుమారుడు భరత్ వివేక్ స్వామివారికి మొక్కుకుని సువర్ణ నేత్రాలు కనుబొమ్మలు చేయించారు. రూ.1.60లక్షల విలువైన బంగారు నేత్రాలు, కనుబొమ్మలను ఆలయ పూజారి పరిటాల సుబ్రహ్మణ్యశర్మకు అందజేశారు. అర్చకులు సంప్రోక్షణల అనంతరం సువర్ణ నేత్రాలు, కనుబొమ్మలను స్వామికి అలంకరించారు. కాపునాడు మండల అధ్యక్షుడు నున్న వెంకటరమణ పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ మృతి



రాయవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మాచవరంలో ఎండీయూ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పలివెల సతీష్(37) శనివారం గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సతీష్ భార్య పలివెల శోభన మాచవరం ఎంపీటీసీ-1గా వ్యవహరిస్తున్నారు. సతీష్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు. సతీష్ మృతికి ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, మండల ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ అధ్యక్షుడు రాయుడు నాగమురళీ, నాయకులు సంతాపం తెలిపారు.

కేన్సర్ స్ర్కీనింగ్ సర్వేపై అవగాహన



అంగరలో క్యాన్సర్ స్ర్కీనింగ్ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కపిలేశ్వరపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీ పరిధిలోని 6 సచివాలయాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది కేన్సర్ స్ర్కీనింగ్ సర్వేపై శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. రత్నకుమారి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతీ ఇంటిని సందర్శించి 18ఏళ్ల పైబడిన వారిని ఇంటి వద్దే క్యాన్సర్‌పై స్ర్కీనింగ్ చేసి అనుమానితులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో జె.మల్లికార్జునుడు, హెచ్‌ఈ రామారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాముల ఇరుముడిధారణ



ర్యాలి అయ్యప్పఆలయంలో ఇరుముడి ధరించిన అయ్యప్పస్వాములు

ఆత్రేయపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అయ్యప్పమాల ధరించిన దీక్షదారులు ఇరుముడి ధారణ నిర్వహించుకుని శబరిమలైకు పయనమవుతున్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా మండల దీక్ష చేపట్టిన అయ్యప్పస్వాములు వేలాదిగా ఇరుముడి ధరించి వివిధ మార్గాల్లో శబరిమలైకు పయనమయ్యారు. ఈనెల15 రాత్రి శబరిమలైలో 18మెట్లకు పడిపూజ నిర్వహించి దర్శనాలకు అనుమతించారు. ఈనేపథ్యంలో మండల దీక్ష చేసి 41రోజులు దీక్ష పూర్తిచేసిన అయ్యప్పస్వాములు గురుస్వాములతో ఇరుముడిధారణ నిర్వహించారు. వాడపాలెం, కొత్తపేట, ఆలమూరు, ర్యాలి, వెలిచేరు గ్రామాల్లోని వేంచేసియున్న అయ్యప్ప ఆలయాల్లో మాల ధరించిన అయ్యప్పస్వాములుగురుస్వాములతో ఇరుముడి ధరించి కార్లు, బస్సులు, రైళ్ల మార్గాల్లో స్వామి సన్నిధికి చేరుకుంటున్నారు. అయ్యప్ప శరణు ఘోషతో ఆలయాలు మార్మోగాయి.

చిన్నారులకు తులాభారం

కపిలేశ్వరపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అంగర శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రామచంద్రపురానికి చెందిన చవాకుల నాగవీరవెంకట సత్యనారాయణ, దుర్గా వైష్ణవి దంపతులు కుమార్తె షణ్ముఖకు పటిక బెల్లంతో తులాభారం నిర్వహించారు. అనపర్తికి చెందిన చిట్టూరి శివశంకర, ఈశ్వరి దంపతుల 5నెలల చిన్నారికి పటిక బెల్లంతో తులాభారం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కె.బాలబాలాజి ఆచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు చిన్నారులను ఆశీర్వదించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

ముగ్గురికి తీవ్ర గాయాలు

ఆత్రేయపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క స్వైర విహారం చేసి ముగ్గురిని గాయపర్చింది. ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. శనివారం స్వామివారిని దర్శించుకునేందుకు తునికి చెందిన ఎం.రాంబాబు, జగ్గంపేటకు చెందిన యు.శివ, విశాఖకు చెందిన అప్పారావు వచ్చారు. గ్రామంలో అటుగా వెళుతున్న వారిని పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆత్రేయపురం పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు చికిత్స చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కపిలేశ్వరపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో గ్రంథాలయాలు, వాటి ప్రయోజనాలు, సీనియర్స్ విభాగంలో పుస్తక పఠనం అవశ్యకతపై ఈ పోటీలు జరిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ అధికారిణి డి. శివకుమారి పాల్గొన్నారు.



ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో పురాతన నాణేలు, నోట్లను చూస్తున్న దృశ్యం

పురాతన నాణేలు, నోట్లు ప్రదర్శన

ఆత్రేయపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో మూడో రోజు శనివారం విశ్రాంత ఉద్యోగి అల్లు రామకృష్ణ పురాతన నాణేలు, కరెన్సీ, స్టాంపుల ప్రదర్శన నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శనను ఎస్‌బీఐ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించగా, విద్యార్థులు, పాఠకులు తిలకించారు. గ్రంథాలయాధికారి నమఃశివాయ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వ్యాస రచన పోటీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ): గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం ద్రాక్షారామ, రామచంద్రపురం శాఖా గ్రంథాలయాల్లో వ్యాస రచన పోటీలు జరిపారు. రామచంద్రపురం, ద్రాక్షారామలో పలు పాఠశాలల విద్యార్థులు వ్యాసరచన పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాయ అధికారి ఎంవీ సూరిబాబు, రామచంద్రపురం గ్రంథాలయాధికారి డి.వెంకటరమణ పాల్గొన్నారు.

రామేశ్వరం తీరంలో వలస మత్స్యకారులపై దాడి

అల్లవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్.రామేశ్వరం తీరంలో కొయ్యింగ చేపల పిల్లల వేట విషయమై పశ్చిమబెంగాల్‌కు చెందిన వలస మత్స్యకారులు, స్థానిక మత్స్యకారుల మధ్య వివాదాలు తలెత్తాయి. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన వలస మత్స్యకారుల తాత్కాలిక గుడిసెను, చేపల పిల్లల గుంటకు గండికొట్టి ఘర్షణకు దిగడంతో ఘర్షణ చెలరేగింది. అంగాడి కాలిస్వామి, చెక్కా శ్రీను, చెక్కా కృష్ణమూర్తితో పాటు 15మంది తీరంలో తమపై దాడికి పాల్పడ్డారని తమకు చెందిన ఐదు సెల్‌ఫోన్లు, రూ.50వేలనగదు పవర్ బ్యాంకు లాగేసుకున్నారని వలస మత్స్యకారులు అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉభయ వర్గాలకు గాయాలయ్యాయి.

రామ్మూర్తినాయుడు సేవలు చిరస్మరణీయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ శాసనసభ్యుడు నారా రామ్మూర్తి నాయుడు సేవలు చిరస్మరణీయమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామ్మూర్తినాయుడు మరణంపై మంత్రి దిగ్ర్బాంతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలిపారు.

ఎమ్మెల్యే బండారు సంతాపం

కొత్తపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మాజీ శాసనసభ్యుడు నారా రామ్మూర్తి నాయుడు మృతితో మంచి మిత్రుడిని కోల్పోయానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. 1994లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. రామ్మూర్తినాయుడు కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు.

చండ్ర పుల్లారెడ్డికి నివాళి

ద్రాక్షారామ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చండ్ర పుల్లారెడ్డి స్ఫూర్తితో అసమానతలు లేని సమాజ నిర్మాణానికి పోరాడాలని ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకట్ల వెంకటేశ్వరావు అన్నారు. రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో కామ్రేడ్ చండ్ర పుల్లారెడ్డి అమరవీరుల సంస్మరణ సభ జరిపారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, చింతా రాజారెడ్డి, అంబటి కృష్ణ, వెంటపల్లి రామకృష్ణ, చల్లపూడి పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

1912ను సద్వినియోగం చేసుకోండి

విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజబాబు



రాయవరం, నవంబరు 16: విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నెంబరు 1912ను ప్రజ లు సద్వినియోగం చేసుకోవాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్. రాజబాబు కోరారు. శనివారం రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జరిగిన విద్యుత్ ఉద్యోగుల కార్తీక వనసమారాధనలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఉన్న 200 యూనిట్ల లోపు వినియోగిస్తున్న వారికి ఉచిత విద్యుత్‌ను అందిస్తుండగా, అవకాశం ఉన్న వినియోగదారుల ఇంటిపై సోలార్ ప్యానల్ పెట్టే ఆలోచన ఉందన్నారు. పీఎం సూర్యఘర్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈ పథకం వల్ల వినియోగదారుడు ఉత్పత్తిదారుడుగా మారే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ప్రమాదంగా ఉన్న విద్యుత్ లైన్లు, స్తంభాలపై 1912 నెంబరుకి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఈ వెంట రామచంద్రపురం డివిజన్ ఈఈ కె.రత్నాలరావు, మండపేట డిప్యూటీ ఎడ్యుకేట్ ఇంజనీరు సీహెచ్ శ్రీధర్, రాజమండ్రి రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ, అనపర్తి సబ్ డివిజన్ డిప్యూటీ ఇం జనీరు నిరంజన్ బాబు తదితరులు ఉన్నారు.

ఐక్యతకు వనసమారాధనలు దోహదం: కార్తీక వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రాజబాబు అన్నారు. శనివారం రాయవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో జరిగిన విద్యుత్ ఉద్యోగుల కార్తీక వనసమారాధనలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు ఉసిరిచెట్టు వద్ద పార్వతి పరమేశ్వరులు, లక్ష్మీనారాయణలకు పూజలు చేశారు. వన సమారాధనలో ఉద్యోగులు ఉల్లాసంగా గడిపారు. రామచంద్రపురం డివిజన్ ఈఈ కె.రత్నాలరావు, మండపేట డిప్యూటీ ఎడ్యుకేట్ ఇంజనీరు సీహెచ్ శ్రీధర్, రాజమండ్రి రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ, అనపర్తి సబ్ డివిజన్ డిప్యూటీ ఇంజనీరు నిరంజన్‌బాబు, విద్యుత్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



గుమ్మిలేరులో సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

వేగంగా సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

ఆలమూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో మంజూరైన అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. వీటి నిర్మాణానికి రూ.2.70 కోట్ల నిధులు మంజూరు కావడంతో జనవరి నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఆలమూరు మండలంలో 11 గ్రామాలలో మంజూరైన నిధులకు గత నెలలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపనలు చేశారు. సీసీ రోడ్ల నిర్మాణాలను ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు శనివారం పరిశీలించారు. వీటి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటిం చాలని ఆయన సూచించారు. జనవరి నాటికి పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌తో మాట్లాడినట్లు ఎంపీడీవో రాజు తెలిపారు.